

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**పెట్టుబడుల్లో అగ్రస్థానంలో ఏపీ**


- హోంమంత్రి వంగలపూడి అనిత

4

# పెట్టుబడుల ఊపులో ఏపీ

## - కొత్త ఏడాదికి బలమైన ఆరంభం

## - సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో నిలిచిందనే వార్త కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎంఐఈ నివేదికపై స్పందిస్తూ ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ పెట్టారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. తాము చేపట్టిన పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అన్న ఆయన.. ఇదంతా ముందుచూపుతో అమలు చేస్తున్న పాలసీ సంస్కరణల ప్రభావం అని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాలవారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. తన విజన్‌పై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ బృందం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్ అభివృద్ధికి దీనిని పునాదిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని వెల్లడించారు.

## మహిళా విద్యకు సావిత్రీ బాయిపూలే బాటలు

### - సీఎం చంద్రబాబు నివాళి



అమరావతి (చైతన్యరథం): మహిళలను విద్యావంతులుగా చేసేందుకు సమాజ కట్టుబాట్లను కాదనే సాహసాన్ని చేసి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరు పొందిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. ఆనాడు ఆమె చేసిన సాహసం ఈనాడు మహిళలను విద్యావంతులుగా చేయడమే కాకుండా పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసేలా తీర్చిదిద్దింది అనడంలో సందేహం లేదన్నారు. అందుకే సావిత్రిబాయి పూలేకు ఆధునిక మహిళలు సదా కృతజ్ఞతలు తెలపాల్సి ఉందన్నారు. సమాజంలో సగభాగమైన మహిళా విద్యలో సావిత్రీ బాయి పూలే కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి కొనియాడారు.

## ఉల్లి రైతులకు ఊరట

- అండగా కూటమి ప్రభుత్వం
- హెక్టారుకు రూ. 50 వేల సాయం రైతుల ఖాతాల్లో జమ
- పరిహారం పంపిణీ చేసిన మంత్రి అచ్చెన్నాయుడు
- కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 37,752 మంది రైతులకు రూ.50,000 చొప్పున రూ.128.33 కోట్లు రూపాయలు జమ



2

## పెట్టుబడుల ఆకర్షణలో.. ఏపీ నెం.1గా నిలవడం గర్వకారణం

- సీఎం చంద్రబాబు విజన్, మంత్రి లోకేష్ పట్టుదల వల్లే రాష్ట్రానికి దిగ్గజ సంస్థలు
- అత్యున్నత విధానాలు, వేగంగా అనుమతులు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని తిరిగి నెలకొల్పాయి
- సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లోనే రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- కూటమి ప్రభుత్వ పాలనా సమర్థతకు ఇదే నిదర్శనం
- పెట్టుబడుల ప్రవాహాన్ని ఆపలేకపోయిన వైసీపీ కుట్రలు, పిటిషన్‌లు
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సంక్షేమం, అభివృద్ధి వికేంద్రీకరణ వైపు అడుగులు
- మంత్రి డా. డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి



3

## స్వప్న సాక్షాత్కారం

- భోగాపురంలో నేడు ట్రయల్ రన్
- ఢిల్లీ నుంచి రానున్న ఎయిర్ ఇండియా విమానం

విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం గేమ్ ఛేంజర్‌గా మారబోతోంది. ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ట్రయల్ రన్‌గా జనవరి 4న తొలి వాణిజ్య విమానం దిగనుంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఎయిర్ ఇండియా విమానం ఉదయం 11 గంటలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఇతర విమానయాన శాఖ అధికారులతో రానుంది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే.. దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రధాన ఆర్థిక కేంద్రంగా విశాఖపట్నం మారనుంది. 24 గంటల పాటు విమాన సర్వీసులు, అంతర్జాతీయ కనెక్టివిటీ, వేలాది ఉద్యోగాలతో ఉత్తరాంధ్ర దశ తిరగబోతోంది. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట రూపుదిద్దుకుంటున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఇప్పుడు శరవేగంగా వాస్తవ రూపం దాల్చుతోంది. ఇది కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఒక అద్భుతం. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పర్యవేక్షణలో పనులు ఊహించని వేగంతో సాగుతూ అనుకున్న దానికంటే ముందే సిద్ధం అయ్యింది.









## కుయ్... కుయ్... వైసీపీకి గూబ గుయ్!

- వైసీపీ కూతలకు... సాక్షి రాతలకు కూటమి ప్రభుత్వం స్ట్రాంగ్ కౌంటర్
- 108 వ్యవస్థను వైసీపీ నిర్వీర్యం చేసిన విధానాన్ని గుర్తు చేసిన మంత్రి సత్యకుమార్
- 108 అంబులెన్సుల విషయంలో తప్పుడు రాతలకు ఎమ్మెల్యే మాధవి రెడ్డి తిరుగులేని సమాధానం
- కడప రిమ్స్ ప్రాంగణంలో వైసీపీ నిర్వాకం వల్ల మూలనపడి ఉన్న 108 అంబులెన్సులను మీడియాకు చూపించిన ఎమ్మెల్యే
- 108 అంబులెన్సుల వ్యవస్థలోనూ వైసీపీ అవినీతికి పాల్పడిందని మండిపడ్డ ఏలూరు ఎమ్మెల్యే
- వాళ్లు చేసిన తప్పిదాలను ఫొటోలు తీసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారంటూ కౌంటర్
- చెంప చెళ్లుమనిపించేలా వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టిన కూటమి ప్రభుత్వం

5



# రైతు శ్రేయస్సే ధ్యేయం

- ఉల్లి రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- హెక్టారుకు రూ. 50 వేల సాయం రైతుల ఖాతాల్లో జమ
- పరిహారం పంపిణీ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు
- కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 37,752 మంది రైతులకు రూ.50,000 చొప్పున రూ.128.33 కోట్లు రూపాయలు జమ




కర్నూలు (చైతన్యరథం): రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ ధ్యేయం అని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్నదాతకు అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉల్లి సాగుతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలతో ఉల్లి రైతులు తీవ్రమైన పంట నష్టం, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం, వారిని ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50,000 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, ఆ మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే రూ.130 కోట్లు మంజూరు చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

### టీడీపీ హయాం.. ఇరిగేషన్‌కు స్వర్ణయుగం

రాష్ట్ర అభివృద్ధికి నీటి పారుదల, వ్యవసాయ రంగాలు అత్యంత కీలకమన్నారు.. 2014-2019 కాలంలో వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలకు స్వర్ణ యుగంగా మంత్రి అభివర్ణించారు. ఆ సమయంలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసమే రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసి శరవేగంతో ముందుకు తీసుకెళ్లామన్నారు. వ్యవసాయ రంగం లో 7-8 ఉన్న జిడిపి ని 17 శాతం వరకు తీసుకొని వెళ్లి దేశంలోనే అగ్రగామిగా నిలిపామన్నారు.. 2019 తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ముఖ్యమైన శాఖలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఇరిగేషన్ రంగానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరాకు నీరిచ్చే విధంగా ఇరిగేషన్ రంగంలో పనులు చేస్తామన్నారు.

### మద్దతు ధరకు కొనుగోలు

తాను వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్న తర్వాత మొదటిగా మిరప పంటకు ధర పడిపోయిందని, కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుని మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి, మార్కెట్‌ను స్థిరీకరించి మిర్చి రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోకో పంట ధర పడిపోతే, కేజీకి రూ.50 రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చి కోకో రైతులను ఆదుకునేందుకు రూ.15 నుండి 20 కోట్ల దాకా ఖర్చు చేశామన్నారు. అదే విధంగా ప్రకాశం జిల్లాలో పొగాకు రైతుల కోసం రూ. 12 వేల గిట్టుబాటు ధర కల్పించి, రూ.300 కోట్లు ఖర్చు చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు 12 రూపాయల ధరను నిర్ణయించి, అందులో 4 రూపాయలు ప్రభుత్వం భరించేలా, మిగిలిన 8 రూపాయలు పరిశ్రమల వారు చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. చెప్పినట్లుగానే ప్రభుత్వం కేజీకి 4 రూపాయల చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో వేసిందన్నారు. ఉల్లి రైతుల విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యం అని ప్రకటించినప్పుడు హెక్టారుకు 17,500 రూపాయలు ఇస్తారని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు మరో అడుగు ముందుకేసి దానికి 7,500 రూపాయలు కలిపి హెక్టారుకు మొత్తం 25,000 రూపాయలు ఉల్లి రైతులకు అందించారన్నారు. కానీ ఈ ఏడాది కర్నూలు జిల్లాలో అనుకోని ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు పెట్టుబడి పెట్టి చాలా నష్టపోయారన్నారు. కిలో ఉల్లిపాయలను 12 రూపాయల చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించామన్నారు. అప్పటికే భారీ వర్షాలు కురుస్తుండటంతో సరైన ప్రణాళిక లేకపోతే రైతులు భారీగా నష్టపోతారని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన వెంటనే స్పందిస్తూ, మనకు రైతులే ప్రాధాన్యం అని చెప్పారన్నారు. ఇప్పటివరకు హెక్టారుకు 25,000 రూపాయల పరిహారం ఇచ్చేవాళ్లం, ఇప్పుడు మరో 25,000 కలిపి, హెక్టారుకు మొత్తం 50,000 రూపాయలను ఉల్లి రైతులకు అందిస్తున్నాం అని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. చెప్పినట్లుగా 130 కోట్ల రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 37,752 మంది రైతులకు 50,000 చొప్పున రూ.128.33 కోట్లు రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. కర్నూలు జిల్లాలోనే 31,352 మంది రైతులకు రూ.99.92 కోట్లు జమ చేస్తున్నామన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా..

గత ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టలేదని, తమ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ లాంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద 2,200 కోట్లు బడ్జెట్ కేటాయించి, 5 సంవత్సరాల్లో కేవలం 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో 2025-26లో ధరలు తగ్గితే ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో బడ్జెట్‌లో 300 కోట్ల రూపాయలు పెట్టామన్నారు. అయితే బడ్జెట్ కేటాయింపులకు మించి 300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పొగాకు కొన్నామని, మామిడికి 270 కోట్లు ఇచ్చామని, ఉల్లి పంట నష్టానికి 130 కోట్లు ఇచ్చామన్నారు. ఎక్కడ ఏ పంటకు నష్టం వచ్చినా, రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్ళలో రూ.1400 కోట్లు ఖర్చు పెడితే చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 18 మాసాల్లో రూ.1170 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద ఖర్చు పెట్టి, నేరుగా రైతుల అకౌంట్లలో వేశామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతలుగా రూ.14000 ఇచ్చాం, ఫిబ్రవరిలో ఇచ్చే రూ.6000తో కలిపితే.. ఇచ్చిన మాట ప్రకారం మొత్తం రూ.20000 రైతుల ఖాతాల్లో జమచేసినట్లవుతుందన్నారు.

### జోరుగా సంక్షేమం, అభివృద్ధి

గతంలో కంటే పెన్షన్లను గణనీయంగా పెంచామని, కేవలం 18 నెలల కాలంలోనే పెన్షన్ల కోసం సుమారు 50,000 కోట్ల రూపాయలను నేరుగా ప్రజలకు అందించామని తెలిపారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటి నెరవేరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒక పక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే.. అభివృద్ధిలో భాగంగా ఇరిగేషన్‌కి ఈ 18 నెలల్లోనే రూ.12 వేల కోట్లు వేశామని, హంద్రీ-నీవా పూర్తి చేశామన్నారు. ప్రధాన మంత్రి సుజల పథకం కింద గత ప్రభుత్వం ఒక్క పైసా వాడుకోకుండా, పథకం ముగిసిపోతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కలిసి ఆ పథకాన్ని పొడిగించేలా కృషి చేశారన్నారు. 2028 నాటికి ఇచ్చిన మాట ప్రకారం, మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం, ఈ రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చే బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

### ఉద్యోగాల కల్పన

రాష్ట్రంలో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత మొత్తం 12 సార్లు ఉపాధ్యాయ నియామకాలు జరిగితే, అందులో 9 సార్లు ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగాయన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఎటువంటి సమస్యలు లేకుండా 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేసి పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించా మన్నారు. అదే విధంగా 6,000 మందికి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను ఇచ్చామని, ఇప్పుడు మళ్ళీ గ్రూప్-2 పోస్టుల నియామకాలు చేపడుతున్నా మన్నారు. ప్రైవేట్ ఉద్యోగాలు కూడా రావాలి అంటే రాష్ట్రానికి భారీ పరిశ్రమలు రావాలన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక వేత్తలకు రాష్ట్రంపై తిరిగి నమ్మకం కలిగించామన్నారు. నేడు దేశంలోనే పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఏపీ కి వచ్చినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో వెల్లడయిందన్నారు. ఇది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయమని మంత్రి తెలిపారు.

### రైతు ద్రోహి జగన్

గత 18 నెలలుగా ఎన్నో సమస్యలు, ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమర్థవంతంగా పరిపాలన అందిస్తున్నామన్నారు. గత వైసీపీ పాలనలో రైతులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా మోసం చేశారని, వ్యవసాయ, అనుబంధ రంగ శాఖల పరిస్థితి అధ్వానంగా తయారుచేశారని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ముఖ్యంగా ఉల్లి రైతుల విషయంలో పూర్తిగా చేతులెత్తేశారని ఆయన మండిపడ్డారు. రాయలసీమ బిడ్డని అంటూ జగన్ సీమ ప్రజల్ని మోసం చేసాడని అన్నారు. రైతులకు మద్దతు ధర, మార్కెట్ జోక్యం, నిల్వ సదుపాయాలు కల్పిస్తామంటూ పెద్దపెద్ద హామీలు ఇచ్చిన వైసీపీ నేతలు వాటన్నింటినీ గాలికొదిలేశారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ప్రభుత్వం అది. రైతుల కష్టాలు కనిపించని అంధ పాలన అది.. అంటూ జగన్ పాలనను తీవ్రంగా ఎండగట్టారు. మా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటను చేతల్లో చూపిస్తోంది. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల భవిష్యత్తును నాశనం చేసిన వైసీపీ పాలనను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని, ఇకపై కూడా రైతుల సమస్యలపై రాజకీయాలు చేసే వారికి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని మంత్రి హెచ్చరించారు.

---

## గన్నవరం విమానాశ్రయంలో

# మారిషస్ అధ్యక్షుడికి ఘనస్వాగతం

గన్నవరం (చైతన్యరథం): మారిషస్ దేశాధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ జీసీఎస్‌కె గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఈ నెల 3 వ తేదీ నుంచి 8 తేదీ వరకు 6 రోజుల భారతదేశ పర్యటనలో భాగంగా కృష్ణాజిల్లా గన్నవరం విమానాశ్రయానికి శనివారం సాయంత్రం కుటుంబ సమేతంగా చేరుకున్న ఆయనకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్వాయిలో ధరంబీర్ గోకుల్ గుంటూరుకు బయలుదేరారు. గుంటూరులో జరుగుతున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఈ నెల 4 వ తేదీన ఆయన పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మారిషస్ హై కమిషన్ మొదటి కార్యదర్శి గీతాంజలి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జిల్లా పోలీసు అధికారి వి. విద్యాసాగర్ నాయుడు, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, విమానాశ్రయం డైరెక్టరు ఎం.ఎల్.కె రెడ్డి, టర్మినల్ ఆపరేషన్ ఇన్చార్జ్ అధికారి అంకిత్ జైస్వాల్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరపున ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి ఎస్ విజయలక్ష్మి, ఉప పాస్‌పోర్ట్ అధికారి రామకృష్ణ, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, విమానాశ్రయం సి ఎస్ ఓ ధర్మేంద్ర, గన్నవరం డిఎస్పి శ్రీనివాసరావు, గన్నవరం తహసిల్దార్ శివయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ముగిసిన అభ్యుదయం సైకిల్ యాత్ర



ఇచ్ఛాపురం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ సంకల్పంతో ఉన్నారని, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ కేంద్రంగా మారి యువత భవిష్యత్తు ఛిన్నాభిన్నమైందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 53 రోజులుగా 1300 కి.మీ. మేర సాగిన 'అభ్యుదయం' సైకిల్ యాత్ర శనివారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హెూంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గంజాయి మూలాలను వెలికితీసి వాటిని పూర్తిగా నిర్మూలిస్తోందని, అలాగే యువతను నైపుణ్యం కలిగిన శక్తిగా మార్చేందుకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా, ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

### భవిష్యత్తు నాశనం: హెూంమంత్రి అనిత

ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడుకలు జరగడం సంతోషంగా ఉందని హెూం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. గంజాయి మత్తులో విద్యార్థులు కన్నవారిపైనే దాడులు చేయడం కలచివేస్తోందని, యువత బంగారు భవితను నాశనం చేసుకోవద్దని కోరారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితుల కష్టాలు చూసి ఆనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. ఐజీ గోపీనాథ్ జెట్టి మానస పుత్రికగా తలపెట్టిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకువచ్చాం. కేవలం శిక్షల ద్వారానే కాకుండా, అవగాహన ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని ఆమె వివరించారు. ఈ సందర్భంగా రూ. 9.13 కోట్ల ఆస్తుల జప్తు, 53 వేల కేజీల గంజాయి ధ్వంసం వంటి గణాంకాలను ప్రస్తావించారు.

### 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్ శాఖతోనే సాధ్యం కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం డ్రగ్స్ మాత్రమే కాకుండా సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై కూడా చైతన్యం తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఈగల్ ఐజి ఎ .రవి కృష్ణ మాట్లాడుతు స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థం అవుతుందని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్రమైన మార్పు వస్తే మత్తుపదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్ కు తెలియజేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ను వినియోగించాలన్నారు. పోలీసుల నుండి ఎలాంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన ఈ యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా కొనసాగిస్తుందని తెలిపారు. ఈ యాత్రలో 1.14 లక్షల మంది విద్యార్థులు, 36 వేల మంది ప్రజలు పాల్గొని ..సే నో టు డ్రగ్స్ బ్రో.. అంటూ నినదించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నడకుదుటి ఈశ్వరరావు, బగ్గు రమణ మూర్తి, గౌతు శిరీష, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు తుహిన్ సిన్హా, ఏఆర్ దామోదర్, మాధవరెడ్డి పాల్గొన్నారు. ముగింపు సందర్భంగా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

## పెట్టుబడుల ఆకర్షణలో..

# ఏపీ నెం.1గా నిలవడం గర్వకారణం

- సీఎం చంద్రబాబు విజన్, మంత్రి లోకేష్ పట్టుదల వల్లే రాష్ట్రానికి దిగ్గజ సంస్థలు
- అత్యున్నత విధానాలు, వేగంగా అనుమతులు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని తిరిగి నెలకొల్పాయి
- సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లోనే రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు
- కూటమి ప్రభుత్వ పాలనా సమర్థతకు ఇదే నిదర్శనం
- పెట్టుబడుల ప్రవాహాన్ని ఆపలేకపోయిన వైసీపీ కుట్రలు, పిటిషన్‌లు
- ప్రజల జీవన ప్రమాణాల పెంపు, సంక్షేమం, అభివృద్ధి వికేంద్రీకరణ వైపు అడుగులు
- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

అమరావతి (చైతన్యరథం): బ్యాంక్ ఆఫ్ బరోడా–సీఎంఐఈ నివేదికలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే నెం.1గా నిలవడం గర్వకారణమని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన సీఎం చంద్రబాబు విజన్, మంత్రి లోకేష్ పట్టుదల వలన రాష్ట్రానికి ప్రపంచ దిగ్గజ కంపెనీలు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ పారిశ్రామికవేత్తల దృష్టి ఈరోజు ఆంధ్రప్రదేశ్ పై ఉందన్నారు. ఏపీలో పెట్టుబడులు ఒక ప్రవాహంలా వచ్చేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం రాష్ట్ర నాయకత్వంపై ఏర్పడిన నమ్మకం, విశ్వాసమే. ఐదేళ్ల వైసీపీ హయాంలో విధ్వంస పాలనను చూశాం, పారిశ్రామిక వేత్తలను వేధింపులకు గురిచేశారు. ఫలితంగా రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలిపోయాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. 25 కీలకమైన పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం అమలు చేసింది. ఇవి దేశంలోనే అత్యుత్తమమైన పాలసీలుగా గుర్తింపు పొందాయి. తక్కువ ధరలకు భూముల కేటాయింపు, విద్యుత్ రాయితీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వంటి చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని ప్రభుత్వం తిరిగి సంపాదించిందని మంత్రి డా.స్వామి వివరించారు.

### వైసీపీ కుయుక్తులకు తలొగ్గని పెట్టుబడిదారులు

పెట్టుబడులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ఎన్నిసార్లు కోర్టులకు వెళ్లినా, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను ఆపలేకపోయారు. రాబోయే 15–20 సంవత్సరాల పాటుకూడా ఈసుస్థిర ప్రభుత్వంపై, ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంపై ఉన్న విశ్వాసంతోనే పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు వస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, యువనేత లోకేష్ పట్టుదల కలగలిపి దేశవిదేశాల్లోని పరిశ్రమలను ఆకర్షిస్తున్నాయి. మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనల సహకారంతో ఏర్పడిన రాజకీయ స్థిరత్వం కూడా పెట్టుబడిదారులకు భరోసా కలిగిస్తోంది. ఈ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందనే నమ్మకంతోనే పెట్టుబడులు ఏపీ వైపు తరలి వస్తున్నాయని స్పష్టం చేశారు.

### దేశంలో సింహభాగం పెట్టుబడులు ఏపీకే

బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన తాజా వార్షిక నివేదిక ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం పెట్టుబడులతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. గత తొమ్మిది నెలల్లో (ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ నిలవడం, తర్వాతి స్థానాల్లో ఒడిశా, మహారాష్ట్రలు ఉండటం – మన నాయకత్వంపై పారిశ్రామికవేత్తల్లో ఉన్న విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం. ఇదే కాకుండా గత ఏడాదిలో "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్"



అవార్డుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంపిక కావడం గర్వకారణం. జాతీయ స్థాయి మీడియా కూడా వాస్తవ పరిస్థితులు తెలుసుకుని అందించిన ఈ గౌరవం, ఆర్థిక ఇబ్బందుల మధ్య కూడా ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు ఎంత ప్రభావవంతమైనవో చూపిస్తోందన్నారు.

### స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు నిదర్శనం

గత నవంబర్‌లో విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా సుమారు రూ.13.25లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాం. యువగళం మేనిఫెస్టోలో చెప్పినట్లు 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ఈ పెట్టుబడులు కీలకంగా మారనున్నాయి. స్టెబిలిటీ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు, సింగిల్ విండో విధానం పెట్టుబడిదారుల్లో మరింత నమ్మకాన్ని పెంచాయి. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో నేను కూడాపలువురు పారిశ్రామికవేత్తలను కలిసినప్పుడు, ప్రభుత్వ విధానాలు మరియు వేగవంతమైన అనుమతులే తమను ఆకర్షించాయని వారు స్పష్టంగా తెలిపారు. నేడు గూగుల్,టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్‌వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. అమరావతిలో దక్షిణాసియాలోనే తొలి క్వాంటం వ్యాలీని నిర్మించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములవుతున్నాయి. రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి చెందింది. ఒకప్పుడు పరిశ్రమలు పారిపోయే పరిస్థితి నుంచి, ఈరోజు ఇతర రాష్ట్రాల నుంచి పరిశ్రమలు ఏపీకి తరలివచ్చే పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చాం. కేవలం 18నెలల్లోనే రూ.25లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలగడం ప్రభుత్వ కృషి, పట్టుదలకు నిదర్శనమని మంత్రి డా. స్వామి స్పష్టం చేశారు.

### అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా..

సంక్షేమాన్ని అమలు చేస్తూనే, గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూ అభివృద్ధి మార్గంలో రాష్ట్రం ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు 40 ఏళ్ల పరిపాలనా అనుభవం, సమర్థ నాయకత్వం దీనికి బలమైన మద్దతుగా నిలిచాయి. ముఖ్యమంత్రి స్పీడ్‌ను అందుకోవడం కష్టమని, ప్రతి రోజు ఆయన నుంచి కొత్త ఆలోచనలు నేర్చుకుంటున్నామని అధికారులే చెబుతున్నారు. రిన్యూవబుల్ ఎనర్జీ, పవర్, కెమికల్స్, మోటార్స్ వంటి రంగాల్లో తీసుకొచ్చిన సంస్కరణలు పరిశ్రమలకు మరింత ఊతమిచ్చాయి. గూగుల్, బీపీసీఎల్, ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ, రిలయన్స్ బయోగ్యాస్, డేటా సెంటర్లు, ఎస్ఏఐఎల్ వంటి సంస్థల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ఇందుకు నిదర్శనం. రాబోయే దావోస్ పర్యటనలో కూడా మరిన్ని పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈపెట్టుబడుల ఒప్పందాలన్నీ అమలైతే ఆంధ్రప్రదేశ్‌ను ఎవ్వరూ ఆపలేరని గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన నేతలే అంగీకరించడం విశేషం. ఎవరు ఎంత విమర్శించినా, రాష్ట్ర పురోగతిని ఆపలేరు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్, ప్రతి కుటుంబం నుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్ అనే ముఖ్యమంత్రి చంద్రబాబు కలలు ఇప్పుడు వాస్తవ రూపం దాలుస్తున్నాయని మంత్రి డా.స్వామి తెలిపారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా–సీఎంఐఈ నివేదికలో దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవడం మనందరికీ గర్వకారణమని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ప్రత్యేకంగా అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు.

# గుంటూరు అభివృద్ధికి పూర్తి సహకారం

- మంత్రి నారాయణ స్పష్టం
- ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3 పనులకు శంకుస్థాపన



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగర అభివృద్ధికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గుంటూరులో ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 కి రూ. 48 కోట్లతో శంకుస్థాపన చేశామని తెలిపారు. మంత్రి నారాయణ శనివారం గుంటూరులో పర్యటించారు. ముందుగా స్వర్ణ భారతి నగర్ వద్ద మంత్రికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కేంద్రమంత్రి, స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్,ఎమ్మెల్యేలతో కలిసి పలు అభివృద్ధి పనులను మంత్రి నారాయణ ప్రారంభించారు. రూ.69.59 కోట్ల విలువైన రోడ్లు, డ్రైనేజిలను ప్రారంభించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శిల్పారామం సెంటర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి మాట లేకుండా రూ.10 లక్షల కోట్లు అప్పుజేసి వెళ్లిపోయిందన్నారు. మున్సిపాల్టీల్లో ప్రజలు కట్టిన ట్యాక్స్ ల నిధులు కూడా ఇతర అవసరాలకు మళ్లించేసిందన్నారు. చెత్తపన్ను వేసి ప్రజలను అనేక ఇబ్బందులు పెట్టింది. 2014-19లో ఏఐఐబీ ద్వారా కేంద్రం నుంచి రూ. 5350 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకున్నాం. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం వల్ల ఆ నిధులు విడుదల కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు.. కేంద్రంతో మాట్లాడి నిధులు విడుదల చేయించారు. స్వచ్ఛ భారత్ ద్వారా కేంద్రం రూ.3000 కోట్లు కేటాయించినప్పటికీ రాష్ట్ర వాటా ఇవ్వలేదు. రాష్ట్ర వాటా రూ.150 కోట్లు విడుదల చేయకపోవడంతో కేంద్రం నుంచి రావల్సిన రూ.3000 కోట్లు విడుదల కాలేదు. అమృత్ 2.0 ద్వారా రూ.8500 కోట్లు కేటాయించినప్పటికీ ఆ నిధులను తీసుకురాలేకపోయారు. గత ప్రభుత్వానికి ఆర్థిక వ్యవస్థను ఎలా నడపాలో తెలియదు. మున్సిపాల్టీల నిధులు ఎక్కడివక్కడే ఉపయోగించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారు. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయి. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంపైనే దృష్టి పెట్టి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు.

# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

- భూములకు పూర్తి భద్రత కల్పించేందుకే రాజముద్రతో పాసు పుస్తకాలు
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టీకరణ



ఆత్మకూరు (చైతన్యరథం): రైతును రాజుగా చూడాలనే ధ్యేయంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. శనివారం ఉదయం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం ఏఎస్‌పేట మండలం హసనాపురం గ్రామంలో రైతుల ఆనందోత్సాహాల నడుమ ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులతో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రైతుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గత ప్రభుత్వం గత ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాలను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. అధికారం చేపట్టిన తొలి క్యాబినెట్ సమావేశంలోనే రైతులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ లటెటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కోటి మంది రైతుల భూములకు వారి హక్కులు లేకుండా చేసే విధంగా పనికిరాని పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించేందుకు ప్రయత్నించిందని, ఎన్నికలకు మూడు నెలల ముందే ఈ దుర్మార్గపు ఆలోచనతో 35 లక్షల రైతుల పాస్ పుస్తకాలను మార్చేశారని విమర్శించారు. దొంగ నోటు లాంటి పాత పాస్ పుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలోని 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత ప్రభుత్వం జగన్ ఫోటోతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేసిందని, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 13 గ్రామాల్లో 5,486 పట్టాలను అందించారని తెలిపారు. వాటి స్థానంలో నేడు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నూతన పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని చెప్పారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఎలాంటి చిన్న తప్పు ఉన్నా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. "రైతుకు అన్నం పెట్టే భూమికి రైతును రాజుగా చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. రీ-సర్వే పేరుతో గత ప్రభుత్వం భూముల సర్వేలో కూడా హద్దురాళ్లపై జగన్ ఫోటోలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేస్తూ సుపరిపాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. 2026 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతులకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, తహశీల్దార్ అనిల్‌కుమార్, స్థానిక నాయకులు రమేష్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, గిరినాయుడు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో కూటమి పాలన

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



విజయవాడ (చైతన్యరథం): అణగారిన వర్గాల ఆశా జ్యోతి సావిత్రిభాయి పూలే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆమె ఆశయాల సాధనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సావిత్రభాయి పూలే జయంతి సందర్భంగా విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి మంత్రి సవిత ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారిణి అని కొనియాడారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన ధీశాలన్నారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీ విద్య కోసం కృషి చేసిన మొట్టమొదటి మహిళా ఉద్యమకారిణి అని అన్నారు. తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుస్తూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం గొప్ప పోరాటం చేశారన్నారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారని, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సావిత్రి బాయిపూలే ఆశయ సాధనే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు మహిళలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేశారన్నారు. మహిళలకు ఉన్నత విద్యే లక్ష్యంగా మహిళా యూనివర్శిటీని నెలకొల్పారన్నారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు రాజకీయ, ఆర్థిక భరోసా కలిగించేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. విద్య, ఉద్యోగావకాశాల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనన్నారు. స్థానిక సంస్థల్లోనూ 34 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. బాలికా విద్య కోసం తల్లికి వందనం పథకం అమలు చేసి, ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేశారన్నారు. మహిళల పేరున రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న లక్ష్యంతో ఎంఎస్ఎంఈ పార్కుల్లో స్త్రీలకు అవకాశమిస్తున్నార న్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల ఆద్యుడు సీఎం చంద్రబాబు అని మంత్రి సవిత కొనియాడారు.

### బీసీ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ

అంతకుముందు ఏపీ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ క్యాలెండర్‌ను మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, నందం అబద్ధయ్య, పేరేపి ఈశ్వర్, ఈశ్వరరావు, శ్రీధర్, వెంకటేశ్వరరాజు సహా పలువురు కార్పొరేషన్ల డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఏపీ బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ప్రతినిధులు కె.శ్రీనివాసులు, ఎం.ప్రసాద్, చలం, వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు విజన్, మంత్రి లోకేష్ పట్టుదలతోనే..

# పెట్టుబడుల్లో అగ్రస్థానంలో ఏపీ

**- హెూంమంత్రి వంగలపూడి అనిత**




అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిబద్ధతకు నిదర్శనంగా, పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలిచిందని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా - సీఎంఐఈ నివేదిక ప్రకారం దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.3శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణం. 2025 ఏప్రిల్ - డిసెంబర్ మధ్య రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వాటా గణాంకాలు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. గత ప్రభుత్వ పాలనలో వేధింపులు, కక్ష సాధింపులతో పతనావస్థకు చేరిన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, కూటమి ప్రభుత్వం పాలనలో మళ్లీ పతాక స్థితికి చేరింది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసు కొచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ వంటి సంస్కర ణల ద్వారా పెట్టుబడిదారుల్లో పెరిగిన నమ్మకమే రాష్ట్రాన్ని అగ్రస్థానానికి చేర్చడంలో కీలకంగా నిలిచింది.కేవలం 18 నెలల కాలంలో రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగ అవకాశాలు తీసుకువచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి,ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి రాష్ట్ర ప్రజల తరఫున, యువత తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సీఎం చంద్రబాబు గ్లోబల్ విజన్, మంత్రి లోకేష్ గ్రౌండ్ లెవల్ ఎగ్జిక్యూషన్.. రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా తీర్చిదిద్ది, రేపటి తరాన్ని మరింత ఉత్తేజితం చేస్తాయని మంత్రి అనిత ఆకాంక్షించారు.

చైతన్యరథం

# కుయ్... కుయ్... వైసీపీకి గూబ గుయ్!

- వైసీపీ కూతలకు... సాక్షి రాతలకు కూటమి ప్రభుత్వం స్ట్రాంగ్ కౌంటర్
- 108 వ్యవస్థను వైసీపీ నిర్వీర్యం చేసిన విధానాన్ని గుర్తు చేసిన మంత్రి సత్యకుమార్
- 108 అంబులెన్సుల విషయంలో తప్పుడు రాతలకు ఎమ్మెల్యే మాధవిరెడ్డి తిరుగులేని సమాధానం
- కడప రిమ్స్ ప్రాంగణంలో వైసీపీ నిర్వాకం వల్ల మూలనపడి ఉన్న 108 అంబులెన్సులను మీడియాకు చూపించిన ఎమ్మెల్యే
- 108 అంబులెన్సుల వ్యవస్థలోనూ వైసీపీ అవినీతికి పాల్పడిందని మండిపడ్డ ఏలూరు ఎమ్మెల్యే
- వాళ్లు చేసిన తప్పిదాలను ఫొటోలు తీసి కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారంటూ కౌంటర్
- చెంప చెళ్లుమనిపించేలా వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టిన కూటమి ప్రభుత్వం




అమరావతి/కడప/ఏలూరు (చైతన్యరథం): గత రెండు రోజుల నుంచి వైసీపీ, ఆ పార్టీ అనుబంధ పత్రిక సాక్షి 108 అంబులెన్సుల విషయంలో తప్పుడు ప్రచారంతో ఊదరగొడుతోంది. వాస్తవాలను పక్కన పెట్టేసి... అవాస్తవాలు, వక్రీకరణకు అలవాటు పడి ఫేక్ రాజకీయాలకు, ఫేక్ ప్రచారానికి కేరాఫ్ అడ్రస్సుగా నిలిచిన వైసీపీ, సాక్షి మీడియాకు దిమ్మతిరిగేలా జవాబు ఇచ్చింది కూటమి ప్రభుత్వం. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జరిగిన ఓ మరణాన్ని 108 అంబులెన్స్ ఆలస్యంగా రావడం వల్లే జరిగిందని తప్పుగా చిత్రీకరించిన వైసీపీ, సాక్షి... ఆ తర్వాత 108 వ్యవస్థను సరిగా నిర్వహించడం లేదంటూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించింది. అబద్ధాల పునాదులతో పుట్టిన వైసీపీకి... ఫేక్ ప్రచారం చేయాలని అజెండాగా పెట్టుకుని సాక్షి పత్రికకు కూటమి ప్రభుత్వం గట్టిగా కౌంటర్ ఇచ్చింది. రణస్థలంలో అంబులెన్సుకు సంబంధించి... అలాగే 108 వ్యవస్థకు సంబంధించి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తన ట్వీటులో అసలు విషయాలు వెల్లడించారు. రణస్థలం ఘటనలో 108కు ఎప్పుడు కాల్ వచ్చింది... అంబులెన్స్ ఎప్పుడు వెళ్లిందనే విషయాన్ని ఆధారాలతో సహా కూలంకుషంగా మంత్రి వివరించారు. ఉదయం 08:05 గంటలకు కాల్ వస్తే.. 08:07 నిమిషాలకు అంబులెన్సుకు విషయం తెలియచేశారని... వెంటనే బయలుదేరిన అంబులెన్స్ ఘటనా స్థలానికి 08:14 చేరుకుందని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అంబులెన్సు పట్టణ ప్రాంతాల్లో 18 నిమిషాల్లోపు, గ్రామీణ ప్రాంతాల్లో 23 ని. లోపు సంఘటనా స్థలానికి చేరాల్సి ఉండగా, ఇక్కడ కేవలం 7 నిమిషాల్లో చేరిందని విషయాన్ని వెల్లడించారు. వాస్తవం ఈ విధంగా ఉంటే... అంబులెన్స్ ఆలస్యంగా వచ్చిందని అభూత కల్పనలు వైసీపీ, సాక్షి పత్రిక ఆరోపణలు గుప్పించిందని మంత్రి వెల్లడించారు. ఇక 108 వ్యవస్థపై వైసీపీ, సాక్షి చేసిన అడ్డగోలు ఆరోపణలకు మంత్రి గట్టిగా సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం 108 అంబులెన్స్ వ్యవస్థను ఏ విధంగా నిర్వీర్యం చేసిందోననే అంశాన్ని ఆధారాలతో సహా మంత్రి వివరించారు. శిథిలమైన అంబులెన్సులను చూపిస్తూ పప్పులో కాలేశారని... గత వైసీపీ ప్రభుత్వం, జగన్ మోహన్ రెడ్డి నిర్వాకం వల్ల వివిధ ఆసుపత్రులలో, రోడ్ల పైన సుమారు 300 అంబులెన్సులు శిథిలమయ్యాయని మంత్రి గుర్తు చేశారు. జగన్ మోహన్ రెడ్డికి చెందిన అస్మదీయ కంపెనీ "అరబిందో" కు ఏడేళ్ల పాటు 104, 108 టెండర్లు అప్పనంగా కట్టబెట్టి 108 వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి బీజం వేశారని చెప్పారు. ఒరిజినల్ ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరర్ ఒప్పందం ప్రకారం, తయారీ సంస్థ "ఫోర్స్" తో నిర్వహణ చేయాల్సి ఉండగా, ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకుని మెయింటెనెన్స్ పేరుతో ప్రజాధనాన్ని ప్యాలెస్ ఖజానాకు తరలించింది వాస్తవం కాదా? అని మంత్రి ప్రశ్నించారు. దీనికి వైసీపీ నుంచి, సాక్షి పత్రిక నుంచి మనమే సమాధానంగా ఉంది. తేలు కుట్టిన దొంగల్లా... కుక్కిన పేనులా ఉండిపోయాయి.

### వైసీపీ దుర్నీతిని ఎండగట్టిన కూటమి ఎమ్మెల్యేలు

మంత్రి సత్యకుమార్ సమాధానంతో కంగుతిన్న వైసీపీ, సాక్షికి చెంప ఛెళ్లుమనిపించేలా వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టారు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి. కడపలోని రిమ్స్ ఆస్పత్రికి నేరుగా మీడియాను తీసుకెళ్లారు.

ఆస్పత్రి ప్రాంగణంలో గత ప్రభుత్వ వైఖరి కారణంగా మూలనపడి.. ఎందుకూ పనికి రాకుండా ఉండిపోయిన 108 అంబులెన్సులను మీడియాకు చూపించారు. వైసీపీ హయాంలో మూలనపడి ఉన్న అంబులెన్సులను చూపిస్తూ... కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారంటూ వైసీపీని, సాక్షిని కడిగిపారేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ... 108 అంబులెన్స్ వ్యవస్థను సరి చేస్తుంటే... తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదంటూ హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కడపకే ఆరు కొత్త అంబులెన్సులను కేటాయించిన విషయాన్ని మాధవి రెడ్డి గుర్తుచేశారు.

ఇక ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ ఏలూరు జిల్లా ఆస్పత్రికి మీడియాను ఆహ్వానించి.. వాస్తవాలు వివరించారు. జిల్లాలో కొత్తగా ఆరు అంబులెన్సులు అందుబాటులోకి వచ్చాయని... అత్యాధునిక సదుపాయాలతో వెంటిలేటర్ సౌకర్యంతో సేవలు అందిస్తున్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు, విమర్శలు చేయడానికి వేరే దారి దొరకక... సాక్షి పత్రిక ఈ తరహా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు.

మొత్తంగా తప్పుడు ఆరోపణలతో ప్రజలను మభ్యపుచ్చే ప్రయత్నం చేస్తున్న వైసీపీ, సాక్షి తప్పుడు విధానాలను కూటమి ప్రభుత్వం, కూటమి ఎమ్మెల్యేలు ఎండగట్టారు. క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితిని వివరిస్తూ... వాస్తవాలను ప్రజలకు నేరుగా చూపిస్తూ... వైసీపీ తాట తీస్తున్నారు. ఈ క్రమంలో వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



---

### ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా

## ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రమాణ స్వీకారం



ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సహచర మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామితో కలిసి హాజరైన మంత్రి ఆనం, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పార్లమెంట్ అధ్యక్షుడు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వం కీలక పాత్ర పోషించాలన్నారు. ఒంగోలు పార్లమెంట్ పరిధిలో పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ మార్గదర్శనంలో రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా శాసనసభ్యులు, టిడిపి నేతలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

---

## రైతుల హక్కులు కాపాడడమే ప్రభుత్వ లక్ష్యం

### , ఓదూరులో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీలో మంత్రి సుభాష్

రామచంద్రపురం (చైతన్యరథం): రాష్ట్రంలో గత ప్రభుత్వ అరాచక పాలన కారణంగా తలెత్తిన భూ సమస్యలను పరిష్కరించి కూటమి ప్రభుత్వం రాజముద్ర తో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం ఓదూరు గ్రామంలో తహశీల్దార్ మృత్యుంజయరావు అధ్యక్షతన రైతులకు పాసుబుక్కుల పంపిణీ కార్యక్రమంలో శనివారం మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో పంపిణీ చేసిన పాసు పుస్తకాలను రద్దు చేసి, నిర్దిష్టమైన సమాచారంతో రాజముద్రతో రైతులకు అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అంతులేని భూ సమస్యలు ఉత్పన్నం కావడంతో కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రైతుల హక్కులను కాపాడుతూ, వారి ఆస్తులకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. భూ సంబంధిత సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించి, అన్నదాతల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. వీఆర్వో లత, సీనియర్ అసిస్టెంట్ రామారావు, రామచంద్రపురం రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కూటమి పార్టీ నాయకులు అద్దంకి సత్య సాయిబాబా, సలాది కృష్ణ, కొండేపూడి శ్రీనాగ తిరుపతిరావు, బుంగా అప్పారావు, కార్యకర్తలు, రైతులు, గ్రామ ప్రజలు, అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సమష్టిగా కొండగట్టు ఆలయ అభివృద్ధి

- గిరి ప్రదక్షిణ మార్గం సాకారం కావాలి
- పనులు మొదలుపెడితే స్వయంగా వచ్చి కరసేవ చేస్తా
- ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించిన టీటీడీకి ధన్యవాదాలు
- పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



కొండగట్టు (చైతన్యరథం): ఆంజనేయస్వామి అందరి దేవుడు, విశ్వాంతర్యామి. ఆయన ఓ ప్రాంతానికి మాత్రమే దేవుడు కాదు. మా ఇలవేల్పు ఆంజనేయ స్వామికి సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గాన్ని కూడా సాకారం చేద్దాం. అందరూ పూనుకొని స్వామి వారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. త్వరలోనే కొండగట్టు ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు స్వామి వారి ఆదేశంగా భావిస్తున్నానని చెప్పారు. బలమైన సంకల్పంతో చేపట్టిన పనికి తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తగిన సహకారం అందించినందుకు ఆనందంగా ఉందన్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.35.19 కోట్లతో వసతి సముదాయం, దీక్ష విరమణ మండపం నిర్మాణాలకు శనివారం పవన్ కళ్యాణ్ శంకుస్థాపనలు చేశారు. 2024 ఎన్నికల ముందు వారాహి యాత్ర ప్రారంభ సమయంలో కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దర్శనానికి పవన్ కళ్యాణ్ వచ్చినపుడు ఆలయంలో వసతి సముదాయం, దీక్ష విరమణ మండపం అవసరాన్ని ఆలయ అధికారులు, పండితులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తులు, ఆంజనేయస్వామి మాల ధరించి వస్తున్న స్వాములు పడుతున్న ఇబ్బందులను చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ చొరవతో టీటీడీ ధార్మిక మండపాల నిర్మాణాల నిమిత్తం వెచ్చిస్తున్న నిధుల నుంచి రూ.35.19 కోట్లను కొండగట్టు ఆలయంలో సత్రం, దీక్షల విరమణ మండపాలను నిర్మించేలా కేటాయించింది. ఈ నిధులతో మొత్తం 96 గదుల వసతి సముదాయం, 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా అతి పెద్ద మండపం అందుబాటులోకి రానున్నాయి. ఈ పనులకు పవన్ కళ్యాణ్ శనివారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు వేదపండితులు శాస్త్రక్తంగా పవన్ కళ్యాణ్‌కి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ కొండగట్టు స్థానం ఎంత శక్తిమంతమైందంటే తెలంగాణకు పూర్తిస్థాయి రక్షణ, బలంగా నిలుస్తోందన్నారు.. కొండగట్టు గిరి ప్రదక్షిణకు ప్రయత్నం మొదలుపెట్టండి. నేను స్వయంగా వచ్చి కరసేవ చేసి ఈ కార్యక్రమంలో పాల్గొంటాను. అంతా సమష్టిగా స్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలి. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం 2008 నుంచి నాకు తెలుసు. ఉస్మానియాలో ఎన్ఎస్‌యూ నాయకుడిగా ఉన్నపుడు, నాతోపాటు కలిసి పనిచేసే వారు. తెలంగాణ ప్రజలు, సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తి. నాకు పునర్జన్మనిచ్చిన కొండగట్టు అంజన్నస్వామి వారి దివ్య అనుగ్రహానికి ప్రత్యక్ష సాక్షి సత్యం. నేను గతంలో కొండగట్టు సందర్శించినపుడు అర్చకులు అప్పట్లో సత్రం కావాలని కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వామి వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపట్టడం ఆనందంగా ఉంది. ఈ అభివృద్ధి పనులు స్వామి వారి ఆదేశంగా భావిస్తున్నాను. బలమైన సంకల్పంతో చేపట్టిన పనికి టీటీడీ బోర్డు తగిన సహకారం అందించినందుకు ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు ఆనందసాయి, మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్.ఎ.సి. ఛైర్మన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ అధికారులు, తదితరులు

## ఆరు నెలల్లో రాజధాని గ్రామాల అభివృద్ధి

- మంత్రి నారాయణ స్పష్టం

అమరావతి (చైతన్యరథం): రాజధాని గ్రామం ఐనవోలులో శనివారం రాత్రి మంత్రి నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు రైతులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో కలిసి గ్రామ సభలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. రాజధాని గ్రామాల అభివృద్ధిపై గ్రామస్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాజధాని గ్రామాల్లో ప్రభుత్వం కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్న నేపథ్యంలో.. గ్రామాల్లో ఉన్న ఇతర అవసరాలను కూడా మంత్రి, ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు అడిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై అప్పటికప్పుడే నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. ఒక్కొక్క గ్రామాన్ని ఎలా అభివృద్ధి చేస్తున్నామో వివరించారు. సుమారు రూ.900 కోట్లతో రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. రాజధాని నిర్మాణంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 6 నెలల్లోగా అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ల్యాండ్ పూలింగ్ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అన్ని హామీలు నెరవేరుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



## గత ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్ది..
# రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాలు

- పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్యరథం): రైతుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రోడ్లు,భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం మీర్జాపురం గ్రామంలో శనివారం నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను స్వయంగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ...సీఎం చంద్రబాబు నాయకత్వంలో "రాజముద్ర" తో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీతో రైతన్నల హక్కులను పరిరక్షిస్తున్నామన్నారు. అన్నదాతలకు ఇచ్చిన మాటకు కట్టుబడి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చీకటి చట్టం ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుచేసి రైతన్నల హక్కులను కాపాడామన్నారు. పాస్ బుక్ లపై రాజముద్ర.. రైతన్నల యాజమాన్య హక్కులను ప్రతిబింబించే పత్రం. అన్నదాతల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ఇది నిదర్శనం. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూసమస్యలు లేకుండా చేయడం మా కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రీ సర్వే పేరిట రైతుల భూముల్లో అనేక అక్రమాలకు పాల్పడింది. అతి ప్రచార యావతో పట్టాదారు పాసుపుస్తకాలు, చివరకు సర్వే రాళ్లపై సైతం జగన్ మోహన్ రెడ్డి బొమ్మలు వేయించుకున్న దుస్థితి తెచ్చారు. రైతుల పాసు పుస్తకాలపై జగన్ మోహన్ రెడ్డి తన బొమ్మలు చూసుకోవాలనే తాపత్రయంతో రూ. 22 కోట్లు ప్రజాధనం తగలేశారు. ఎవడబ్బ సొమ్మని నీ ఫోటోలు వేసుకుంటావని నాడు ప్రతిపక్షంగా మేమంతా నిలదీశాం. నాడు వైసిపి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా జగన్మోహన్ రెడ్డి ఫోటోలే.. పబ్లిసిటీ పిచ్చి పరాకాష్టకు చేరిన రోజులవి. నాటి రీసర్వే తప్పులను సరిదిద్ది, నేడు పట్టాదారు పాస్‌బుక్ లపై రాజముద్ర వేసి రైతుల హక్కులు కాపాడుతున్నాం. గ్రామాల్లో రైతులకు నిద్ర లేకుండా చేసిన చరిత్ర నాటి వైసిపి అరాచక ప్రభుత్వానిది. తల్లిదండ్రులు నుంచి, వారసత్వంగా వచ్చిన భూమిపై.. అన్నదాతలు తమ సొంత పిల్లల మాదిరి ఎంతో మమకారం పెంచుకుంటారు. వైసిపి ప్రభుత్వం రైతన్నల భావోద్వేగాలతో ఆడుకుంది. కష్టాన్ని నమ్ముకుని బ్రతికే రైతులను ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గత ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టింది. నాడు ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన ప్రతి హామీని విజయవంతంగా అమలు చేశామని గర్వంగా చెప్పగలమని మంత్రి జనార్దన్ రెడ్డి అన్నారు.

**పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రం**

దేశంలో పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం కూటమి ప్రభుత్వ పనితీరు, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వ పటిమకు నిదర్శనం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఆకర్షించి అగ్రస్థానంలో నిలవడం.. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న ఆర్థిక అభివృద్ధికి నిదర్శనం. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన నివేదికలో ముందంజలో నిలిచి జాతీయస్థాయిలో మరోసారి తన సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్. పెట్టుబడుల్లో 4 వంతు వాటాను సాధించడం జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు రాష్ట్ర నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనం. సుస్థిరమైన, నమ్మకమైన, సమర్థవంతమైన కూటమి ప్రభుత్వ పనితీరే రాష్ట్రానికి పెట్టుబడు లను తీసుకొస్తోంది. విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ట్రూ అప్ ఛార్జీల భారం దాదాపు రూ. 4,500 కోట్లు కూటమి ప్రభుత్వం భరిస్తోంది. విద్యుత్ రంగంలో సంస్కరణలలో భాగంగా ఛార్జీలను తగ్గిస్తూ... ప్రజలపై భారం పడకుండా.. ట్రూ అప్ ఛార్జీల భారాన్ని భరిం చేందుకు కూటమిప్రభుత్వం సిద్ధపడింది. విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ట్రూ అప్ ప్రతిపాదనలు పెట్టగా.. డిస్కంల ప్రతిపాదనలను తిరస్కరిస్తూ... ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని ఏపీఈఆర్సీకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. ట్రూ అప్ ఛార్జీల పేరుతో గతంలో రూ.32,166 కోట్ల మేర విద్యుత్ ఛార్జీలు పెంచి అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచింది. ఏపీఈఆర్సీ చరిత్రలో ట్రూ డౌన్ అమలు చేసిన తొలి ప్రభు త్వంగా నేడు కూటమి సర్కార్ చరిత్ర సృష్టించిం దని మంత్రి జనార్దన్ రెడ్డి ఉద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో బనగానపల్లె నూతన ఆర్డీఓ నరసింహులు, స్థానిక ఎమ్మార్వో నారాయణరెడ్డి, ఎంపీడీవో నాగరాజు, ఇతర ఉన్నతాధికారులు, కూటమి పార్టీ నేతలు, కార్య కర్తలు, స్థానిక రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# భూకబ్జా, బెదిరింపులపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

- మిగులు భూమి అక్రమ రిజిస్ట్రేషన్, న్యాయం చేయాలి
- రాజకీయ పలుకుబడితో వారసత్వ భూమి కబ్జాకు యత్నం
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు





అమరావతి (చైతన్యరథం): తమ పొలాన్ని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని టీడీపీ నేతలకు బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం కావూరు గ్రామానికి చెందిన కోడూరి నాగ మారుతి ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ప్రజల నుంచి సాంఘిక సంక్షేమ శాఖ డోలా బాల వీరాంజనేయస్వామి, ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా నేతలకు నాగ మారుతి అర్జీ ఇచ్చి... తనకు గుంటూరు రెవిన్యూ పరిధిలోని కాకుమాను మండలం పాటూరు గ్రామంలో 328 ఏ సర్వే నెంబర్‌లో పొలం ఉందన్నారు. ఆ పొలాన్ని కాకి సాంబయ్య కుటుంబం దౌర్జన్యంగా సాగు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. మేము మా పొలం దగ్గరకు వెళ్తే.. చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికే కాకి సాంబయ్య కుటుంబం మీద 15 కేసులు ఉన్నాయని తెలిపారు. సంబంధిత వ్యక్తి మీద రౌడీ షీట్ కూడా తెరిచారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ అండదండలతో అప్పటి కాకుమాను పోలీసులకు లంచం ఇచ్చి తనపై తప్పుడు కౌంటర్ కేసులు పెట్టి, ఎస్.బి.డబ్ల్యు. చేయించి, వీఆర్వోతో రిపోర్టు పెట్టించి, తనపైనే తిరిగి కేసులు వేశారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

కర్నూలు జిల్లా గోనేగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బుడన్న అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన సొంత గ్రామంలోనే తనకు 0.45 సెంట్ల మిగులు భూమి ఉందన్నారు. సంబంధిత భూమిని అదే గ్రామానికి చెందిన వి. రాంబాబు దొంగతనంగా రిజిస్టర్ చేయించుకున్నట్లు ఆరోపించారు. తన భూమికి సంబంధించిన పత్రాలన్నీ తన పేరు మీదనే ఉన్నాయని .. తన భూమి తనకు చేరేలా చూడాలని కోరారు.

అన్నమయ్య జిల్లా, మదనపల్లి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన జి. మోనిషా అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమ తండ్రికి చెందిన 2.5 ఎకరాల పట్టా వ్యవసాయ భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సంబంధిత భూమికి రిజిస్ట్రేషన్ పత్రాలు, పట్టా, 1-బీ, సీసీ, తదితర అన్ని చట్టబద్ధమైన రికార్డులు ఉన్నాయి. అలాగే అన్నదాత సుఖీభవ పథకం కూడా క్రమం తప్పకుండా అమలవుతోంది. గజ్జెల నీతప్ప అనే వ్యక్తి రాజకీయ, ఆర్థిక పలుకుబడిని ఉపయోగించి తమ కుటుంబాన్ని బెదిరిస్తూ, దాడులు చేసి తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామానికి చెందిన సాంబశివరావు విజ్ఞప్తి చేస్తూ.. గుంటూరు శివారు రెడ్డిపాలెం, 4వ లైన్ ఎక్స్‌టెన్షన్, సరస్వతి కాలనీలోని సర్వే నెం. 273లో 101.5 చ.గజాల ఇంటి స్థలాన్ని తాను 20-12-2004 న ప్రావిడెంట్ దస్తావేజు నెం. 16808/2004 ప్రకారం చట్టబద్ధంగా కొనుగోలు చేశానన్నారు. సదరు దస్తావేజులో ప్లాటు నెంబరు లేకపోగా, తప్పుగా ఇతరుల ప్లాటు నెంబరు నమోదు కావడంతో సవరణ కోరినా ఇప్పటివరకు జరగలేదన్నారు. సదరు భూమి సరిహద్దులు స్పష్టంగా ఉన్నప్పటికీ, చుక్కా విజయకుమార్, చుక్కా సాంబశివరావు, మాచాబత్తిన నాగేంద్రం కుమారుడు వీరహనుమాన్ కలిసి తమ భూమిని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేశారన్నారు. ఇది తమ స్థలమని ముందే తెలియజేసినా దౌర్జన్యంగా అడ్డుకున్నారని, స్థలానికి రానివ్వకుండా బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం.. ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## మంత్రులు, జడ్జిల భవనాలు మార్చి చివరికి పూర్తి

- మంత్రి నారాయణ



అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై పురపాలకశాఖ మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు మార్చి నెలాఖరుకు పూర్తి చేసి ఏప్రిల్‌లో హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ శనివారం పర్యటించి నిర్మాణంలో ఉన్న ప్రధాన కార్యదర్శులు, న్యాయమూర్తులు, మంత్రుల బంగళాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ఫ్లాట్లు నిర్మిస్తున్నామని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు అధికం గా వచ్చాయి. వర్షాలు తగ్గాక అన్ని పనులు చేపట్టాం. మంత్రుల బంగళాలు చాలా వరకు పూర్తయ్యాయి. జడ్జి ల బంగళాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టరింగ్ తుదిదశకు చేరాయి. అఖిల భారత సర్వీసుల అధికారుల టవర్లు కూడా తుది దశకు చేరాయి. 500 నివాస సముదాయాలు మినహా మిగిలిన అన్ని మార్చి నెలాఖరుకు పూర్తి అవుతాయి. తరువాత భవనాలన్నీ జీఏడికి హ్యాండ్ ఓవర్ చేస్తాం. సీడ్ యాక్సిస్ రోడ్ కు భూసేకరణ నోటిఫికేషన్ ఈ నెల 7వ తేదీ ఇంకా నాలుగున్నర ఎకరాలు రావాల్సి ఉంది. దీనిలో 2 ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సుముఖంగా ఉన్నారని మంత్రి నారాయణ తెలిపారు.

## టూరిజం కేంద్రంగా పోలవరం

### - మంత్రి నిమ్మల సమీక్ష



విజయవాడ (చైతన్యరథం): పోలవరం స్పిల్ వే బ్యూటిఫికేషన్‌కు సంబంధించి విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు శనివారం సమీక్షించారు. ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ టూరిజం హబ్ గా లేఅవుట్ ప్లాన్ డిజైన్ చేసేందుకు పోలవరం ప్రాజెక్టు ఏరియా మొత్తం లైడార్ సర్వే జరుగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టులో కుడి, ఎడమ వైపున ఉన్న ప్రధాన కట్టడాలను కలుపుతూ రూ.548 కోట్లతో లింక్ రోడ్ పనులు త్వరలోనే మొదలుపెడతామన్నారు. పోలవరం లెఫ్ట్ బ్యాంక్ ప్రొటక్షన్ వాల్, గండిపోచమ్మ దేవాయలం రక్షణకు రిటైనింగ్ వాల్ పనులు చేపట్టబోతున్నామన్నారు. ఎన్‌హెచ్-365బీబీ, ఎన్‌హెచ్-516ఈ లను పోలవరానికి అనుసంధానించేలా నేషనల్ హైవేస్ అథారిటీతో సంప్రదింపులు చేస్తున్నామన్నారు. ఈనెల 7వ తేదీన సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని మంత్రి నిమ్మల తెలిపారు.

## సాలూరులో కోటి రూపాయలతో యూపీహెచ్‌సీ

- ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

సాలూరు (చైతన్యరథం): మహిళల ఆరోగ్యమే కుటుంబ శ్రేయస్సుకు పునాది అని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సహజ ప్రసవాలపై అవగాహనతో తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారన్నారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కుటుంబం మొత్తం బాధ్యత అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో రూ.99.94 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను (యూపీహెచ్‌సీ) శని వారం మంత్రి ప్రారంభించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని, 2018 లో చంద్రబాబు నాయుడు మంజూరు చేసిన ఆసుపత్రిని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఎంతగానో సహకరించిన విషయాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఆసుపత్రి ద్వారా గిరిజనులు, పేదలు, పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుందన్నారు.

## పండుగ వాతావరణంలో పాస్ పుస్తకాల పంపిణీ

- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరిత వాతావరణంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెండు రోజుల్లో ల 21 వేల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేశామన్నారు. తొమ్మిదో తేదీ లోపు రైతుల చేతికి మొత్తం 22 లక్షల పాస్ పుస్తకాలు అందజేస్తామన్నారు. 26 జిల్లాల్లోనూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. రాజముద్ర, క్యూఆర్ కోడ్ ముద్రించిన పటిష్టమైన పాస్ బుక్ తో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామన్నారు.



రైతులకు అనుమానాలుంటే గ్రామసభల్లోనే అధికారుల ద్వారా తీర్చుకోవచ్చు అన్నారు. గ్రామ సభల్లో అన్ని రకాల రికార్డులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

## నగదు రహిత వైద్య సేవల్లో

# కూటమి పాలనలో భారీ పురోగతి

- డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వ్యయంలో 60 శాతం పెరుగుదల
- 21 శాతం పెరిగిన లబ్ధిదారులు
- నిర్దేశిత సమయంలో రోగుల వద్దకు చేరుకుంటున్న 108 వాహనాలు
- అగ్రిమెంట్ ప్రకారం 95 శాతం రోగులను గంటలోగా ఆసుపత్రులకు చేరుస్తున్న వైనం
- 104 వాహనాల ద్వారా త్వరలో ఇంటి వద్దనే 41 వైద్య పరీక్షలు
- అమలు, నిర్వహణను సమీక్షించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్య సేవలు అందించడంలో సానుకూలమైన మార్పు స్పష్టంగా కనిపిస్తోందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ పథకం కింద కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా పెరిగిన వ్యయం, లబ్ధిదారుల సంఖ్య ఇందుకు నిదర్శనమని మంత్రి తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల అమలును, 108 మరియు 104 సేవలను శనివారం వర్చువల్‌గా సంబంధిత అధికారులతో మంత్రి వివరంగా సమీక్షించారు. 108 సేవలకు సంబంధించిన టెండర్‌లో కూటమి ప్రభుత్వం గతానికి భిన్నంగా కఠినమైన నిబంధనలు విధించడంతో ఈ సేవలు ఎంతో మెరుగుపడ్డాయని మంత్రి వివరించారు. పెరిగిన లబ్ధిదారులు, వ్యయం.. గత వైసిపి ప్రభుత్వం డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రొసీజర్ల సంఖ్యను 3,257కు పెంచి పూర్తి స్థాయిలో అమలు పరచిన 2022-23, 2023-24 కాలంలో ఫలితాలను.. గత 19 నెలల కూటమి పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద సాధించిన ఫలితాలను మంత్రి తులనాత్మకంగా విశ్లేషించారు. 2022-24 కాలంలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం 23,08,930 మంది కింద లబ్ధిపొందారు. దీనిప్రకారం సగటున నెలకు 96,205 మందికి ఆరోగ్యశ్రీ సేవలందాయి. కూటమి ప్రభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ ఏడాది డిసెంబరు వరకు మొత్తం 24,49,117 లబ్ధిదారులకు వైద్య సేవలందాయి. ఈ మేరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్ధిదారుల్లో 21 శాతం వృద్ధి నమోదైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం కింద నెలకు సగటున రూ.193 కోట్లు ఖర్చు నమోదుకాగా, కూటమి పాలనలో నెలవారీ ఖర్చు రూ.310 కోట్లకు చేరడంతో 60 శాతం పెరుగుదల నమోదైంది. ఈ విధంగా నెలవారీగా రూ.177 కోట్ల అదనపు ఖర్చుతో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే ఏడాదికి రూ.2,124 కోట్లు ఎక్కువగా వ్యయం చేస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ.11,577 కోట్ల ఖర్చు నమోదు చేయగా, కూటమి ప్రభుత్వం గత 19 నెలల్లోనే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.6,530 కోట్ల వ్యయాన్ని నమోదు చేసింది. ఈ వ్యయం గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో చేసిన మొత్తం వ్యయంలో 56 శాతం. ఈ విధంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద పెరుగుతున్న ఖర్చు, లబ్ధిదారుల సంఖ్య ఈ పథకం అమలు పట్ల ప్రజల సానుకూల వైఖరికి అద్దంపడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలును, ఫలితాలను ముఖ్య కార్య నిర్వాహక అధికారి(సిఇఓ) కొత్తమాసు దినేష్‌కుమార్, ఇతర అధికారులు మంత్రికి వివరించారు.




### కూటమి ప్రభుత్వ వైఖరితో 108 సేవల్లో సత్ఫలితాలు

గత ప్రభుత్వ హయాంలో అరబిందో ఎమెర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ 108 సేవలను అందించడంలో ఎదురైన అనుభవాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఏడాది జూన్‌లో ఈ సేవల్ని భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు టెండరు ప్రక్రియ ద్వారా అప్పగించింది. గత అనుభవాల్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం కఠినమైన టెండర్ నిబంధనల్ని రూపొందించింది. పర్యవసానంగా 108 సేవల్లో సానుకూల ఫలితాలొస్తున్నాయని మంత్రికి అధికారులు వివరించారు. గత ఏడాది జూన్ నుంచి 108 వాహనాలు అగ్రిమెంట్‌లో పొందుపర్చిన సమయ నిబంధనల మేరకు రోగులకు చేరుతున్నాయని, ముఖ్యంగా గోల్డెన్ అవర్ (108 వాహనం కోసం ఫోన్ కాల్ వచ్చినప్పట్నించి గంటలోగా రోగిని ఆసుపత్రికి చేర్చడం) విషయంలో సత్ఫలితాలొస్తున్నాయని అధికారులు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఫోన్ కాల్ వచ్చినప్పట్నించి 18 నిమిషాల్లో 108 వాహనం రోగి వద్దకు చేరాల్సి ఉండగా ఇప్పటి వరకు సగటున కేవలం 37సెకన్ల ఆలస్యంతో ఆ వాహనాలు రోగుల వద్దకు చేరుతున్నాయని అధికారులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యవధి 23 నిమిషాలుగా నిర్దేశించబడగా సగటున కేవలం 13 సెకన్లు మాత్రమే ఆలస్యం అవుతోందని, గిరిజన ప్రాంతాల్లో 33 నిమిషాల్లో 108 అంబులెన్సులు రోగుల వద్దకు చేరాల్సి ఉండగా సగటున 2 నిమిషాల 34 సెకండ్ల ముందే చేరుతున్నాయని అధికారులు తెలపగా మంత్రి హర్షం వ్యక్తం చేశారు. దీనికి భిన్నంగా గత ప్రభుత్వ హయాంలో 108 వాహనాలు పట్టణ ప్రాంతాల్లో సగటున 12 నిమిషాల 45 సెకండ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 12 నిమిషాల 39 సెకండ్లు, గిరిజన ప్రాంతాల్లో 9 నిమిషాల 30 సెకండ్ల ఆలస్యంగా చేరాయని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మొత్తం 731 అంబులెన్సులు (108) నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని నిబంధన ఉన్నా సగటున కేవలం 612 వాహనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం రూపొందించిన నియమం మేరకు ప్రస్తుతం 108 వాహనాల ద్వారా 95.58 శాతం రోగులు సగటున 1 గంట 5 నిమిషాల్లో ఆసుపత్రులకు చేరుకుంటున్నారని అధికారులు తెలిపారు. గతంలో ఈ నిబంధన లేనందున కేవలం 15 శాతం రోగులు సగటున 1 గంట 57 నిమిషాల్లో ఆసుపత్రులకు చేరగలిగేవారని వారు వివరించారు.

### గత ప్రభుత్వానికి కాగ్ అక్షింతలు

గత ప్రభుత్వ హయాంలో 108 అంబులెన్సుల పనితీరుపై కాగ్ తీవ్రమైన ఆరోపణలు చేసినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అధికారులు వివరించారు. అంబులెన్స్ కోసం ఫోన్ కాల్ వచ్చినప్పట్నించి నిర్దేశించిన సమయంలో అవి రోగులకు చేరలేదని, ఈ అంబులెన్సుల్లో వివిధ పరికరాలు ప్రమాణాల మేరకు పనిచేయలేదని, సిబ్బంది నియామకంలో కొరత ఉందని, ఏసీలు పనిచేయలేదని, క్రిటికల్ కేసుల్ని అడ్వాన్స్‌డ్ లైఫ్ సిస్టంతో కూడిన అంబులెన్స్‌లో కాకుండా కనీస సౌకర్యాలు మాత్రమే ఉన్న వాహనాలను కేటాయించారని గతేడాది జూన్‌లో కాగ్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దీంతో పాటు ప్రతిరోజూ సగటున 200 ఎమెర్జెన్సీ టెలిఫోన్ కాల్స్‌కు అరబిందో సంస్థ స్పందించేది కాదని అధికారులు వివరించారు.

### పూర్తిస్థాయిలో సేవలందిస్తున్న 108 వాహనాలు

గతంలో 108 సేవల్ని నిర్వహించిన అరబిందో సంస్థ వాహనాలకు తగు సమయంలో అవసరాల మేరకు మెయింటెనెన్స్ చర్యలు చేపట్టకపోవడంతో 42 వాహనాలు రిపేరుకు కూడా పనికిరాకుండా పోవడం, 615 అంబులెన్సులకు మేజర్ రిపేర్లు, 103 వాహనాలకు మైనర్ రిపేర్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు 190 కొత్త అంబులెన్సులను ప్రస్తుత ఏజెన్సీ సమకూర్చాల్సి వచ్చింది. వెరసి ఈ ఏడాది జూన్‌లో మొత్తం 768 వాహనాల్లో 67 శాతం మాత్రమే వర్కింగ్ కండిషన్ లో ఉన్నాయి. తగు చర్యల ద్వారా పనిచేసే అంబులెన్స్ సంఖ్యను క్రమేణా పెంచుతూ ఈ ఏడాది నవంబరు నాటికి వంద శాతం 108 అంబులెన్సుల ద్వారా సేవలందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### 108 టెండర్:కఠిన నిబంధనలు

1) 108 సర్వీసుల టెండర్ కేటాయింపునకు సంబంధించి కూటమి ప్రభుత్వం కఠిన నిబంధనల్ని అమలు చేసింది. గత ప్రభుత్వం 50 కంటే తక్కువ 108 అంబులెన్సులు నడిపిన అనుభవం ఉన్నవారికి అవకాశాన్ని కల్పించగా కూటమి ప్రభుత్వం కనీసంగా 100 అంబులెన్సులు నడిపిన అనుభవం ఉండాలన్న నిబంధనను పెట్టి 800 వాహనాలను నడిపిన అనుభవం కలవారిని ప్రోత్సహించే విధంగా నిబంధనలు రూపొందించింది.
2) గత టెండర్ సమయంలో గత మూడేళ్లలో ఏడాదికి అంబులెన్సులు నడపడంద్వారా రూ.25 కోట్లు ఆదాయం ఉన్నవారికి అర్హత కల్పించగా కూటమి ప్రభుత్వం దీన్ని కనీసంగా రూ.100 కోట్ల మేరకు పెంచి అంతకంటే ఎక్కువ ఆదాయం చూపినవారికి ప్రోత్సాహకాలు కల్పించింది.
3) గత ప్రభుత్వం ఒక్కో అంబులెన్స్‌కు ఒక ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ మరియు డ్రైవర్‌ను నియమించాలని నిబంధన పెట్టగా కూటమి ప్రభుత్వం ఒక్కో అంబులెన్స్‌కు ఇద్దరేసి చొప్పున టెక్నీషియన్లు మరియు డ్రైవర్లు ఉండాలనే నియమం పెట్టింది.
4) అరబిందో సంస్థకు టెండర్ కేటాయించినప్పుడు గత ప్రభుత్వం గోల్డెన్ అవర్‌నిబంధన పెట్టలేదు. దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం టెలిఫోన్ కాల్ వచ్చిన గంటలోపే రోగిని 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించాలని నిబంధన పెట్టింది.

### 104 వాహనాల ద్వారా విస్తృత ప్రయోజనాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు 104 వాహనాల ద్వారా త్వరలో ప్రతి ఒక్కరికీ 41 రకాల వైద్య పరీక్షలు చేసే ప్రక్రియను చేపడతామని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ఈమేరకు జరుగుతున్న సన్నాహకాల గురించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104 వాహన సేవలు ఎంతో కీలకమైనవని, వీటి అమలు, నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన సేవల్ని అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

---

# ట్రూఅప్ చార్జీలు పూర్తిగా రద్దు చేశాం

- రూ.4497 కోట్లు భరించనున్న ప్రభుత్వం
- పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో రాష్ట్రం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

ఆత్మకూరు (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలపై భారం మోపిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను తమ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గం ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ప్రజలపై విద్యుత్ చార్జీలతో పాటు ట్రూఅప్ చార్జీల భారం మోపిందన్నారు. ఐదేళ్లలో సుమారు 32,166 వేల కోట్లను ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేసిందన్నారు. ఇక నుంచి ట్రూప్ చార్జీలను ప్రజల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ సంవత్సరానికి మొత్తం రూ.4497 కోట్లను ప్రభుత్వం భరిస్తూ ప్రజల నుంచి వసూలు చేయకుండా రద్దు చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్‌శాఖ తిరుపతి రీజియన్ పరిధిలో 1551.69 కోట్ల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇంత మంచి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి ప్రభుత్వానికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే గత ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను పెంచుకుంటూ పోతే తమ ప్రభుత్వం ఈ ఏడాదిలో కనీసం యూనిట్‌కు 40పైసలు తగ్గించాలనే ఆలోచన చేస్తోందన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరలకు అందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి ఆనం స్పష్టం చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే పారిశ్రామిక రంగంలో పెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయం తాము ప్రకటించుకున్నది కాదనీ, దేశంలోనే పేరెన్నిక గల బ్యాంక్ ఆఫ్ బరోడా తమ సర్వేలో వెల్లడిరచినట్లు చెప్పారు. పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో సుపరిపాలనతో రామరాజ్య స్థాపనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి ఆనం పునరుద్ఘాటించారు.



# పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో
# చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ హాజరు 94 శాతం

- ఏడు చర్చల్లో పాల్గొని 122 ప్రశ్నలకు సమాధానాలను రాబట్టిన ఎంపీ
- కొనియాడుతున్న నియోజకవర్గ ప్రజలు

చిత్తూరు (చైతన్యరథం): పార్లమెంటు శీతాకాల సమావేశాలకు 94 శాతం హాజరుతో చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ళ ప్రసాదరావు అరుదైన ఘనత సాధించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీ దగ్గుమళ్ల పనిచేసారు. లోక్‌సభలో ఏడు చర్చల్లో పాల్గొని, 122 ప్రశ్నలకు సమాధానాలను రాబట్టారు. ముఖ్యంగా హెల్త్ సెక్యూరిటీ, సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025, రైల్వే శాఖ కింద గ్రాంట్ నెంబర్ 80కి డిమాండ్, కేంద్ర బడ్జెట్ 2025- 26, బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు 2024 పై లోక్ సభలో జరిగిన చర్చలో పాల్గొని , ఆయా శాఖలకు సంబంధించిన మంత్రుల నుంచి సమాధానాలతో పాటు ఫలితాలను రాబట్టారు. అలాగే ఎన్‌హెచ్‌ఎం కింద మెటర్నిటీ యూనిట్స్ అప్ డేట్స్, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం అమలు, జిల్లా సెషన్స్ కోర్టులు ఏర్పాటు, పీఎంఎస్



కింద మెగా ఫుడ్ పార్క్స్, అటల్ వయో అభ్యుదయ యోజన కింద వచ్చిన నిధులు ఆంధ్రప్రదేశ్ కు ఏ మేరకు మంజూరయ్యాయో అన్న అంశాలకు సంబంధించిన ప్రశ్నలు వేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ.., కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందనతో పాటు ప్రతి అంశానికి లిఖితపూర్వకంగా సమాధానాలు కూడా రాబట్టారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హక్కులు..,ప్రజా ప్రయోజనాల సాధన కోసం లోకసభలో తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కృషిని నియోజకవర్గ ప్రజలు కొనియాడుతున్నారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా ఏపీ



- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సమర్థతతోనే అగ్రస్థానంలో రాష్ట్రం
- సంక్షేమం, అభివృద్ధి బ్యాలెన్స్ చేస్తూ పాలన
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు (చైతన్యరథం): దేశంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూల్లోని ఆయన కార్యాలయంలో శనివారం మంత్రి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సీ.ఎం.ఐ.ఈ డేటా ఆధారంగా విడుదల చేసిన నివేదికలో దేశవ్యాప్తంగా గత తొమ్మిది నెలల్లో వచ్చిన పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాతో ఏపీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ బలమైన నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి టీజీ భరత్ అన్నారు. మాటిచ్చిన విధంగా రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుండీ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. చంద్రబాబు బ్రాండ్ చూసి ఏపీకి పెట్టుబడిదారులు తరలివస్తున్నారని పేర్కొన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడే పరిస్థితిని గత పాలకులు తీసుకొస్తే.. తమ ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తల్లో పూర్తి నమ్మకాన్ని కలిగించామన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. విశాఖలో జరిగిన ఒప్పందాలన్నీ గ్రౌండింగ్ అయ్యేలా తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఒక్క జూమ్ కాల్‌లో మాట్లాడి రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కిందన్నారు. విశాఖకు గూగుల్ రాకతో ఇప్పుడు అందరి దృష్టి ఏపీవైపు మళ్లిందన్నారు. బెస్ట్ పాలసీలు తీసుకురావడంతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు కావాలన్నా పెట్టుబడిదారులకు ఇబ్బంది కలగకుండా వేగంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని మంత్రి టీజీ భరత్ చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు.

## సీఎం విదేశీ పర్యటనపై...
# వైసీపీ సైకోల దుష్ప్రచారం

- రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం తపించే నాయకుడిపై పిచ్చి ప్రేలాపనలు
- విదేశాల్లో ఉన్నా రాష్ట్ర పరిస్థితులపై సీఎం ఎప్పటికప్పుడు సమీక్ష
- లిడ్‌క్యాప్ చైర్మన్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనపై వైసీపీ సైకో బ్యాచ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. చంద్రబాబు నాయుడు, లోకేష్ కనిపించట్లేదని, రాష్ట్రాన్ని వదిలేసి వెళ్లిపోయారంటూ వైసీపీ గ్యాంగ్ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ, శునకానందం పొందుతున్నారని ఆయన మండిపడ్డారు. అసలు ప్రజల సమస్యలపై మాట్లాడే దమ్ము లేక, రాజకీయంగా ఖాళీ అయిపోయిన జగన్ రెడ్డి బృందం ఇలా పిచ్చి ప్రచారాలతో సంతృప్తి పడుతోందన్నారు. చంద్రబాబు నాయుడుపై, లోకేష్‌పై, పవన్ కళ్యాణ్‌పై చేసే ఆరోపణలు అన్నీ జగన్ రెడ్డి ఫ్రస్ట్రేషన్‌కు నిదర్శనం. ప్రజల సమస్యలపై నిజంగా పోరాటం చేస్తే వారు ఆదరిస్తారు. కానీ వైసీపీ నాయకులు అబద్ధాలు, వ్యక్తిగత దూషణలు, కుటుంబాలపై నీచ వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ దిగజారుడుతనం చూపిస్తున్నారు. ఇవన్నీ ప్రజలు పట్టించుకోరన్న సంగతి ఆ సైకో బ్యాచ్ గుర్తుపెట్టుకోవాలన్నారు.

### రోజుకు 18 గంటలు పనిచేసే నాయకుడు

సీఎం చంద్రబాబు 75 ఏళ్ల వయసులో కూడా రోజుకు 18 గంటలు రాష్ట్రం కోసం పనిచేస్తున్న నాయకుడు. జగన్ రెడ్డి విధ్వంస పాలనలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు గత 18 నెలలుగా ఆయన అహర్నిశలు కష్టపడుతున్నారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి, పాలనా వ్యవస్థల పునరుద్ధరణ – ఇవన్నీ ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారు. 365 రోజులు రాష్ట్రం కోసం పనిచేసే నాయకుడు, నూతన సంవత్సరం సందర్భంగా నాలుగు రోజులు కుటుంబంతో విదేశాలకు వెళ్తే కూడా ఓర్చుకోలేని స్థితిలో వైసీపీ ఉంది. రాజకీయంగా మాట్లాడేందుకు అంశాలు లేక అమరావతి అభివృద్ధి, రోడ్లు, భవనాలు, కోర్టు నిర్మాణాలు, రింగ్ రోడ్, పోలవరం వంటి అసలు విషయాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రాధాన్యతగా తీసుకుని అనుకున్న సమయానికి పూర్తి చేసే దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. పెన్షన్ల విషయంలో ఇప్పటివరకు దాదాపు 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి, ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇంటికే పెన్షన్ అందిస్తున్న ప్రభుత్వం ఇది. జగన్ హయాంలో పెన్షన్ రూ.3000లకు



పెంచుతామన్న హామీ కూడా సక్రమంగా నేరవేర్చలేకపోయారు. జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ లేని పరిస్థితి. అదే జగన్ ఇప్పుడు పోలీస్ నోటీసులు ఎదుర్కొంటున్న వ్యక్తులకు అపాయింట్‌మెంట్‌లు ఇచ్చే స్థితిలో ఉన్నారు. ఇది వైసీపీ రాజకీయాల అసలు రూపమని మాణిక్యరావు విమర్శించారు.

### విదేశాల్లో ఉన్నా నిరంతరం సమీక్ష

సీఎం చంద్రబాబు నాయుడు విదేశాల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర పరిస్థితులపై నిరంతరం సమీక్ష చేస్తున్నారు. రైతుల భూములపై రాజముద్రతో పాసుపుస్తకాలు అందించి భూ హక్కులకు భరోసా కల్పించారు. జగన్ రెడ్డి హయాంలో తాతముత్తాతల భూములపై సైకో బొమ్మలు వేసి రైతులను భయపెట్టారు. అందుకే ప్రజలు ఒక్క దెబ్బతో వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు.

22 ఏ భూముల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్న భూములకు విముక్తి కల్పించి, భూ హక్కులకు భరోసా ఇచ్చింది ఈ ప్రభుత్వం. ఇది నాయకత్వ బాధ్యత అంటే ఏమిటో చూపిస్తోంది. రాష్ట్రంపై ప్రేమ, ప్రజలపై బాధ్యత, అభివృద్ధిపై ఆకాంక్ష ఉన్న నాయకత్వం చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్‌దే. పిచ్చి ప్రెస్ మీట్లు, పిచ్చి ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే రోజులు ముగిశాయి. 2025లో వ్యవస్థలను గాడిలో పెట్టిన ప్రభుత్వం, 2026లో మరింత ఉత్సాహంతో అభివృద్ధి, సంక్షేమాన్ని రెట్టింపు చేయడానికి సిద్ధంగా ఉంది. చంద్రబాబు నాయుడు కనిపించట్లేదని మాట్లాడే వాళ్లకు స్పష్టంగా చెబుతున్నాం. ప్రజలకు ఈ నాయకత్వంపై నమ్మకం ఉంది. వైసీపీ దుష్ప్రచారాన్ని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారని మాణిక్యరావు స్పష్టం చేశారు.

# మహిళల ఆరోగ్యం కుటుంబ శ్రేయస్సుకు పునాది



సాలూరు (చైతన్యరథం): మహిళల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కుటుంబం మొత్తం భద్రతకు ఎంతో అవసరమని రాష్ట్ర స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరులో రూ.99.94 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ... మారుతున్న ఆహారపు అలవాట్లు వ్యవసాయంలో రసాయనాల అధిక వినియోగం వంటి అంశాల కారణంగా కొత్త రకాల వ్యాధులు పెరుగుతున్నాయని చెప్పారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. సిజేరియన్ ఆపరేషన్లు పెరుగుతున్న నేపథ్యంలో, తల్లుల ఆరోగ్యం, భవిష్యత్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, సాధ్యమైనంత వరకు నార్మల్ డెలివరీల పట్ల అవగాహన పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. తల్లీబిడ్డల క్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న 'బేబీ కిట్ల' వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనాభా సమతుల్యతకూ తల్లుల ఆరోగ్యం కీలకమని మంత్రి పేర్కొన్నారు. సాలూరు ప్రాంతంలో మెరుగైన వైద్య సదుపాయాల అవసరాన్ని గుర్తించి, 100 పడకల ఆసుపత్రి మంజూరుకు ప్రభుత్వం చూపిన సహకారాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఆసుపత్రి ద్వారా గిరిజనులు, పేదలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తోందని తెలిపారు. గర్భిణి స్త్రీలు మరియు చిన్నారుల కోసం ప్రత్యేక సదుపాయాలతో ఈ కొత్త హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధునాతన ప్రయోగశాల, రక్తపరీక్షలు, అవసరమైన టీకాలు ఒకే చోట లభ్యమవుతాయని తెలిపారు.

# అచ్యుతాపురం సెజ్‌లో భారీ అగ్ని ప్రమాదం



అచ్యుతాపురం (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్లోని ఫార్మా పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఎస్వీఎస్ కంపెనీలో ప్రమాదవశాత్తూ మంటలు రేగాయి. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 14 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. దట్టమైన పొగలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అచ్యుతాపురం సెజ్లో ప్రమాదంపై అధికారులతో ంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట (చైతన్యరథం): రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీతో భూ యజమానుల హక్కులను కాపాడుతున్న కూటమి ప్రభుత్వం...చింతలూరులో పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....ప్రభుత్వ నూతనంగా అందిస్తున్న రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు రైతన్నల ఆస్తులకు పరిరక్షణగా నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం చింతలూరులో శనివారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ గ్రామసభలు, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతుల యాజమాన్య హక్కులను కాలరాసేలాగ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చిందని అన్నారు. ఆ దుర్మార్గపు చట్టాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిందన్నారు. పాస్ బుక్ ల పంపిణీ పేరుతో, సర్వేల పేరుతో అనేక అవకతవకలు జగన్ ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజలకు తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆస్తులపై హక్కును కాలదన్నేలా వ్యవహరించిందని అన్నారు. జగన్ తన సొంత ఫోటోలతో, తన పార్టీ రంగులద్ది తప్పుల తడకల పాసు పుస్తకాలు ప్రజలకు ఇచ్చారని విమర్శించారు. వాటిలో కూడా అనేక తప్పులు దొర్లాయని అన్నారు. కూటమి ప్రభుత్వం హయంలో రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నామన్నారు.ప్రతి పట్టాదారు పాసు పుస్తకం మీద క్యూఆర్ కోడ్ ఉందని ఆ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే మీ భూమి లోకేషన్ ఎక్కడ ఉందో తెలుస్తుందని అన్నారు. టెక్నాలజీని ఉపయోగించి డిజిటలైజేషన్ చేసి భూ యజమానుల హక్కులు పరిరక్షించడం జరిగిందన్నారు. వైసీపీ పాలనలో తలెత్తిన రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

# సంక్రాంతి ఫెస్టివల్ బ్రౌచర్‌ను ఆవిష్కరించిన ఎంపీ హరీష్ బాలయోగి



యానాం (చైతన్యరథం): డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం బీచ్ వద్ద ఈ నెల 14,15,16 తేదీలలో జరుగనున్న ఆంధ్రా గోవా కోకో బీచ్ సంక్రాంతి ఫెస్టివల్ బ్రౌచర్‌ను అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎంపీ గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమోళి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడులు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా జరపడానికి నిర్ణయించడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి సంబరాలు నిర్వహించడానికి పాటుపడుతున్న ఎమ్మెల్యే ఆనందరావును అభినందించారు. ఈ సంక్రాంతి పండుగ అందరికీ సంతోషాన్ని, ఆహ్లాదాన్ని ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# నిత్యం ప్రజాసేవలో ముందుండాలి

- అరకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు ఎమ్.తేజోవతి
- ఎమ్మెల్యే, రాష్ట్రఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి



రంపచోడవరం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని నమ్ముకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు ఎమ్.తేజోవతి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో శనివారం పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాసయాదవ్ సౌజన్యంలో టీడీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ అధ్యక్షురాలుగా పోలవరం జిల్లాలో అడుగు పెట్టిన ఎమ్.తేజోవతిని ఎమ్మెల్యే శిరీషదేవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి నామినేటెడ్ సభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులను పరిచయం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ... పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తానని తెలిపారు. కార్యకర్తల అభీష్టం మేరకు పని చేస్తానని పేర్కొన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకువెళ్లటంలో పార్టీ శ్రేణులు సంయుక్తంగా పని చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు హయాంలో అభివృద్ధి సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీలు అన్నీ అమలు చేశామన్నారు.. పరిపాలన సౌలభ్యం రీత్యా పోలవరం జిల్లా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని అన్నారు.

# రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలతో రైతులకు గౌరవం

- నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్రను కలిగి ఉన్న నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేసి రైతుల, హక్కును, గౌరవాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కాపాడారని ప్రభుత్వ విప్ కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం నాడు పార్వతీపురం మన్యం జిల్లా, కొమరాడ మండలం దళాయిపేట గ్రామంలో నిర్వహించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు. గతంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఫోటోతో జారీ చేసిన భూమి పాస్ పుస్తకాలను రద్దు చేసి, కూటమి ప్రభుత్వం రైతు ఫోటోతో పాటు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్ కలిగిన నూతన పాస్ పుస్తకాలను జారీ చేయడం గర్వకారణమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూముల రీ-సర్వే ప్రక్రియను పూర్తిచేసి, స్పష్టమైన హక్కులతో రైతులకు పాస్ పుస్తకాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే అన్నారు. తమ భూమికి తమ ఫోటోతోనే పాస్ పుస్తకాలు అందడం వల్ల రైతులకు మరింత భరోసా, గౌరవం కలిగిందని ఎమ్మెల్యే అన్నారు.

# రైతులకు రాజముద్రతో భరోసా : ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట (చైతన్యరథం): రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వ్యాఖ్యానించారు. శనివారం జలుమూరు మండలం, కరవంజి గ్రామంలో రి సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ నూతనంగా జారీ చేసిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు సంక్షేమం దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకువస్తుందని, ఇప్పటివరకు భూ యజమాని యొక్క హక్కులను సరిగ్గా నిర్ధారించకపోవడంతో, హద్దులు నిర్ణయించడంలో చిన్న చిన్న తగాదాలు జరగడం వలన విభేదాలకు కారణం అవుతున్నాయని అన్నారు. కొత్త సర్వే చేసి ఆ సర్వే ప్రకారం ఎవరి నిర్దేశిత భూమి వారికి అందే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేస్తున్నారని రైతులకు తెలిపారు.

# పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



కొవ్వూరు (చైతన్యరథం): తాళ్లపూడి మండలం పోచవరం గ్రామంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే, అధికారంలోకి వచ్చిన వెంటనే రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని కూటమి ప్రభుత్వం ఈరోజు నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ప్రసాద్, చలపాటి ప్రకాష్, నామన పరమేశ్వరరావు, నీరుకొండ రమేష్, కూచిపూడి గణపతి, అన్నమరెడ్డి రమణ, కొప్పాక జవహర్, తిగిరిపల్లి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధిలో ధర్మకర్తల మండలి పాత్ర అత్యంత కీలకం : నక్కా ఆనందబాబు



వేమూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండలం గోవాడ శ్రీబాల కోటేశ్వరస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా నియమితులైన ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి.. వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ సంప్రదాయాలు, ఆచారాలు, ఆధ్యాత్మిక పరిరక్షణతో పాటు ఆలయ సమగ్ర అభివృద్ధిలో ధర్మకర్తల మండలి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయ వైభవాన్ని మరింత పెంపొందించే దిశగా ధర్మకర్తల మండలి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ఏపీ అభివృద్ధిలో చంద్రబాబు దార్శనికత, లోకేశ్ పట్టుదల

**●పెట్టుబడుల్లో నెంబర్ వన్ స్థానం సాధించడం హర్షణీయం : దేవినేని ఉమా**



విజయవాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేధింపులు, కక్ష సాధింపులతో పాలన పూర్తిగా పతనావస్థకు చేరుకుందని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. వైసీపీ నిర్వాకంతో పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు తరలిపోయారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికత, మంత్రి నారా లోకేశ్ పట్టుదలతో పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని సాధించిందని ఆయన అన్నారు. గొల్లపూడిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమా మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టమైన గణాంకాలతో వివరణ ఇచ్చారు. ః:వైసీపీ హయాంలో వేధింపులు, కక్ష సాధింపులు రాజ్యమేలాయి. దీంతో పాలన పూర్తిగా పతనావస్థకు చేరుకుంది. వారి నిర్వాకంతో పెట్టుబడిదారులు రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు తరలిపోయారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగించింది:: అని ఆయన అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిందని, సీఎం చంద్రబాబు నాయుడు దార్శనికతకు, మంత్రి నారా లోకేశ్ పట్టుదలకు నిదర్శనంగా పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ, బ్యాంక్ ఆఫ్ బరోడా తాజాగా విడుదల చేసిన నివేదిక మరియు ఫోర్బ్స్ ఇండియా వెల్లడించిన గణాంకాలు స్పష్టంగా ఉన్నాయని ఉమా తెలిపారు. ః:ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం వాటాతో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన ఘనత అని ఆయన అన్నారు. 18 నెలల్లో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగ అవకాశాలను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన వివరించారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఉమా పేర్కొన్నారు. పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఎనర్జీ, డిజిటల్ రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. ముఖ్యంగా భోగాపురం గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీ అభివృద్ధిలో గేమ్-ఛేంజర్‌గా మారబోతోంది. ఇది రాష్ట్రానికి కొత్త దిశానిర్దేశం చేస్తుంది అని ఆయన చెప్పారు. గతంలో వైసీపీ తెచ్చిన వివాదాస్పద చట్టాలపై కూడా ఉమా స్పందించారు. అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది, దీంతో ప్రజలకు అభద్రతను దూరం చేశాం.

# బెస్ట్‌గా వెస్ట్ బైపాస్‌లో పోదాం!

**●అందుబాటులోకి విజయవాడ పశ్చిమ బైపాస్**

**●కాజ-గొల్లపూడి మధ్య ఒకవైపు కార్లు, బైక్‌లకు అనుమతి**

**●మార్చి నెలాఖరులోగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి**



అమరావతి (చైతన్యరథం) : విజయవాడ, అమరావతి, హైదరాబాద్, విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులకు తీపికబురు. సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభంకానుంది. ఈ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపు వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వనున్నారు. మొదట కార్లు, బైక్‌లు ఈ మార్గంలో వెళ్లేందుకు అనుమతిస్తారు. దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా గొల్లపూడి, చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లడానికి వీలవుతుంది. ఈ తాత్కాలిక ఏర్పాటుతో, సంక్రాంతి సమయంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. గుంటూరు నుంచి ఏలూరు వెళ్లే వాహనాలు ఇకపై విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ బైపాస్ మార్గాన్ని పాక్షికంగా ఒకవైపు మాత్రమే వాహనాల కోసం తెరుస్తారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ మార్పు వల్ల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

**విజయవాడ నగరంలోకి వచ్చే అవసరం లేకుండానే హైదరాబాద్, ఏలూరు వైపు మార్గం**

వెస్ట్ బైపాస్‌లో భాగంగా కాజ నుంచి గొల్లపూడి వరకు 17.88 కిలోమీటర్ల రహదారిని నిర్మిస్తున్నారు. అలాగే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి వరకు 30 కిలోమీటర్ల ఆరు వరుసల హైవే నిర్మాణం కూడా జరుగుతోంది. గొల్లపూడి-చిన్నఅవుటపల్లి మధ్య రోడ్డు నిర్మాణం పూర్తయింది. నవంబర్ నెల నుంచే ఈ మార్గంలో అన్ని రకాల వాహనాలు వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు కాజ-గొల్లపూడి మధ్య కూడా ఒకవైపు వాహనాల రాకపోకలకు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా, కాజ నుంచి గొల్లపూడి వైపు వెళ్లే ఒక మార్గాన్ని సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. చెన్నై-కోల్‌కతా హైవేను ఈ వెస్ట్ బైపాస్‌కు అనుసంధానం చేసే పనుల్లో ఒకవైపు పూర్తయింది. దీనివల్ల చెన్నై, ఒంగోలు, గుంటూరు నుంచి వచ్చే వాహనాలు కాజ దగ్గర వెస్ట్ బైపాస్‌లోకి ప్రవేశించి, గొల్లపూడి చేరుకుని, అక్కడి నుంచి విజయవాడ-హైదరాబాద్ హైవేలో వెళ్లవచ్చు. అలాగే, ఏలూరు వైపు వెళ్లే వాహనాలు గొల్లపూడి వద్ద దిగాల్సిన అవసరం లేకుండా నేరుగా చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు రోడ్డుపైకి చేరుకోవచ్చు. దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే కార్లు విజయవాడ నగరం లోపలికి రాకుండానే, బైపాస్‌లో ఒకవైపు ప్రయాణించి హైదరాబాద్ వైపుగానీ, ఏలూరు వైపుగానీ వెళ్లే అవకాశం కలుగుతుంది. ఈ పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

**మరింత సౌకర్యవంతంగా ప్రయాణం**

వెస్ట్ బైపాస్‌లో వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు పనులు వేగవంతమయ్యాయి. ప్రస్తుతం ఏలూరు, గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలు రాష్ట్ర సచివాలయం, హైకోర్టులకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ప్రస్తుతం, కృష్ణా నది వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత టోల్‌ప్లాజా సమీపంలో వాహనాలు మంగళగిరి-మందడం రోడ్డులోకి మళ్లి, అక్కడి నుంచి సచివాలయం వైపు వెళ్తున్నాయి. ఈ ఏర్పాటు వల్ల వాహనాల ప్రయాణ సమయం తగ్గుతుంది. ఇకపై, గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలను ఈ నెలాఖరు నాటికి హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతించేలా బైపాస్‌లో రెండో వైపు పనులు పూర్తిచేయనున్నారు. వెస్ట్ బైపాస్ నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్‌లో దిగే వాహనాలు చెన్నై-కోల్‌కతా హైవే సర్వీస్ రోడ్డులోకి వెళ్తాయి. ఈ మార్పుల వల్ల వాహనదారులు మరింత సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ఈ అభివృద్ధి పనులు వాహనాల రద్దీని తగ్గించి, ప్రయాణాన్ని మరింత సౌకర్యవంతంగా మారుస్తాయి.

**మార్చి నెలాఖరులోగా పెండింగ్ పనులు పూర్తి**

మార్చి నెలాఖరులోగా వెస్ట్ బైపాస్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి నెలాఖరులోగా అన్ని పనులు పూర్తిచేసి, ఏప్రిల్ 1 నుంచి బైపాస్‌ను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. ఈ బైపాస్ నిర్మాణం వల్ల నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని భావిస్తున్నారు. వెస్ట్ బైపాస్ మీదుగా ఏప్రిల్ 1 నుంచి చెన్నై-కోల్‌కతా హైవేపై వెళ్లే అన్ని వాహనాలను ఇరువైపులా పూర్తిస్థాయిలో అనుమతిస్తారు. అప్పటి నుంచి వెస్ట్ బైపాస్ పూర్తిగా తెరిచినట్లు అవుతుంది. అంతవరకు చిన్న వాహనాలను ప్రయోగాత్మకంగానే అనుమతిస్తారు. ఈ బైపాస్‌లో కృష్ణానదిపై లైటింగ్ ఏర్పాటు చేశారు. పాలవాగు, కొండవీటి వాగుల వద్ద నిర్మించిన వంతెనలు, ఇతర అండర్‌పాస్‌ల వద్ద కూడా వంతెనలకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే, వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

# కొత్తపాలెం - కోటప్పకొండ రహదారికి మోక్షం



నరసరావుపేట (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ శైవక్షేత్రాలలో గుంటూరు జిల్లాలోని నరసరావుపేట నియోజకవర్గంలో ఉన్న కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం ఒకటి. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో జరిగే తిరునాళ్లకు భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే కోటప్పకొండ దేవస్థానానికి వెళ్లే దారులలో.. కొత్తపాలెం - కోటప్పకొండ రోడ్డు కూడా ఒకటి. అయితే ఈ రహదారి అధ్వాన్నంగా మారటంతో భక్తులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. అయితే ఇకపై ఈ ఇబ్బందులు తొలగనున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో.. కొత్తపాలెం - కోటప్పకొండ మధ్య రహదారి నిర్మాణం వేగంగా జరుగుతోంది. స్థానికులతో పాటుగా భక్తులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కొత్తపాలెం - కోటప్పకొండ రోడ్డు పనులు జోరందుకున్నాయి. త్వరలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం.. ఈ రోడ్డును ప్రారంభించనున్నారు. మొత్తం రూ.3.9 కోట్లతో కోటప్పకొండ రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. మరోవైపు కోటప్పకొండ రహదారి నిర్మాణం కోసం నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్ బాబు గతంలో.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ రహదారి విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ చూపించారు. రోడ్డు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రంగంలోకి దిగి.. రోడ్డు నిర్మాణం కోసం చర్యలు చేపట్టారు. రూ.3.9 కోట్ల వ్యయంతో కొత్తపాలెం - కోటప్పకొండ రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. మొత్తం 8 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా కోటప్పకొండ నుంచి గోనెపూడి మీదుగా కొత్తపాలెం వరకు ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు సాయంతో.. చిలకలూరిపేట - నరసరావుపేట రహదారికి చేరుకోవచ్చు. మరోవైపు నాదెండ్ల మండలం వైపు నుంచి కోటప్పకొండ వచ్చే ప్రయాణికులు, భక్తులు ఈ రోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్

◆ప్రజల వద్దకు పాలన తీసుకు వచ్చిన నాయకుడు సీఎం చంద్రబాబు : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాదర్బార్ వేదికగా నిలుస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గం భవానీపురం 41వ డివిజన్ మస్జీద్ రోడ్‌లో శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్డీయే కూటమి నాయకులు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ ప్రజాదర్బార్‌లో ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, నియోజకవర్గ పరిశీలకులు చిట్టాబత్తుని శ్రీనివాసరావు, జిల్లా ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో స్వయంగా మాట్లాడి వారి నుంచి ఎంపీ కేశినేని శివనాథ్ అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులకు ఎంపీ కేశినేని శివనాథ్ దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజా దర్బార్‌లో ఇళ్ల, ఇళ్ల స్థలాల కోసం ప్రజలు ఎక్కువగా అర్జీలు పెట్టుకున్నారు. అలాగే వితంతు పెన్షన్లు, వృద్ధాప్య పెన్షన్లు, వికలాంగులు పెన్షన్ల కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం అధికారంలో వచ్చిన దగ్గర నుంచి ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రతివారం ఒక డివిజన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి వచ్చిన అర్జీలను పి.జి.ఆర్.ఎస్ ఆన్‌లైన్ ద్వారా వివిధ శాఖలకు పంపించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ డివిజన్‌లో పెన్షన్లు, హౌసింగ్ స్థలాల కొరకు అర్జీలు రావటం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు ఎవ్వరూ ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ప్రతి పక్షంలో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తాము... అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి వారం ప్రజాదర్బార్ ద్వారా ప్రజల ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నదే ఐటీ, విద్య శాఖల మంత్రి నారాలోకేష్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే ఆశయాలు ప్రతి ఆడపిల్లకు ఆదర్శం

◆ సావిత్రిబాయి పూలేకి నివాళులర్పించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... సావిత్రిబాయి పూలే... జ్యోతిరావు పూలే సహచరిణిగా మాత్రమే కాకుండా, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా చిరస్మరణీయులని, ప్రతి ఆడపిల్ల తప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఆనాటి సమాజంలో కులవివక్ష, మతవివక్ష, మూఢాచారాలు, బాల్యవివాహాలు, సతీ వంటి అనేక అవరోధాలు ఉన్న సమయంలో ఆడపిల్ల చదవాలి, చదువు విముక్తికి మార్గం అనే ఆశయంతో సావిత్రిబాయి పూలే... ముందడుగు వేశారని గుర్తు చేశారు. చిన్నప్పుడే చదువు అవకాశం లేకపోయినా, వివాహానంతరం జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువుకుని ఉపాధ్యాయురాలిగా మారి, వేలాది ఆడపిల్లల జీవితాల్లో వెలుగు నింపారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పాఠశాల తలుపులు తెరవడానికి వెళ్తూ అవమానాలు, బురదజల్లులు, రాళ్ల దాడులు ఎదుర్కొన్నప్పటికీ వెనకడుగు వేయకుండా, మరో చీర బ్యాగులో పెట్టుకుని మరీ ధైర్యంగా తన కర్తవ్యాన్ని కొనసాగించిన అపార సంకల్పశక్తి సావిత్రిబాయి పూలే గొప్పతనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈరోజు సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నా, ఇంకా కొన్ని చోట్ల వివక్ష కొనసాగుతోందని, దాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే తెలిపారు. నేటి కాలంలో మహిళలు అంతరిక్షం వరకు వెళ్లగలుగుతున్నారంటే, సావిత్రిబాయి పూలే వంటి మ న్యతుల కృషి ఫలితమేనని అన్నారు. గొప్ప కవయిత్రి, గొప్ప భావజాలం కలిగిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించే అవకాశం లభించడం తమ అదృష్టమని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతుహక్కుకు చట్టభద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ బాధ్యత : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గం కంకిపాడు మండలం కొనతనపాడు చలివెంద్రపాలెం గ్రామాలలో తహశీల్దార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతుకు పట్టా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. ఆర్డీఓ హెలా షారోను పాల్గొని ప్రభుత్వం రాజముద్ర చిహ్నంతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... రైతు తన భూమికి సంబంధించిన పాసుపుస్తకం పైన గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ఫోటో ఉండేలా నిర్ణయం రైతు హక్కును ఉల్లంఘించి ఇబ్బంది పెట్టారని సర్వే రాళ్లపై జగన్ ఫోటోలు, ప్రభుత్వ భవనాలు, నిర్మాణాలపై వైసీపీ రంగులు వేయడం వంటి ప్రజావ్యతిరేక విధానాలు చేసి ప్రజల ఆగ్రహానికి గురయ్యారని, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజల హక్కులు కాపాడుతూ, సంక్షేమాన్ని, అభివృద్ధి అందిస్తున్నామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పండుగ

◆రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన జీవీ



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ రైతులకు పండుగల మారిందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం నీలగంగవరం గ్రామంలో శనివారం ఃమీ భూమి – మీ హక్కుః కార్యక్రమంలో చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లా, జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నరసరావుపేట ఆర్డీవో మధులత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ... పట్టాదారు పాస్ పుస్తకాలు, హద్దు రాళ్లపై తన బొమ్మలు వేసుకున్న చరిత్ర జగన్ మోహన్ రెడ్డిదని, అయితే రాజముద్ర వేసి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం చేతకాని జగన్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి ల్యాండ్ గ్రాఫి యాక్ట్ తెచ్చామని జీవి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ నిషేధిత భూముల జాబితా (22-ఏ)లో నుండి ఐదు కేటగిరీల భూములను జాబితాల నుంచి తొలగించి రైతులకు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుందన్నారు. వారసత్వ ఆస్తులు 100 రూపాయలకే రిజిస్ట్రేషన్ చేయించి రైతులను ఆదుకోవడమే చంద్రబాబు నాయుడు పరదర్శక పాలనకు నిదర్శనం అన్నారు. అన్ని గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసి భూ వివాదాలకు తావు లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా అండగా ఉంటుందని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు.

# నవ్యాంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల ప్రదేశ్‌గా మార్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్‌ది

◆ ప్రపంచం మెచ్చే చంద్రబాబు పాలనా సంస్కరణల్ని స్వాగతిస్తేనే రాష్ట్రంలో జగన్‌కు.. వైసీపీకి మనుగడ : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): "నవ్యాంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల ప్రదేశ్‌గా, సన్ రైజ్ స్టేట్‌ను ఇన్వెస్ట్మెంట్స్, ఎంప్లాయ్ మెంట్‌కు కేరాఫ్‌గా మార్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్‌లదే. వారు ఇరువురి నిర్విరామ కృషి వల్లే ఏఐ టెక్నాలజీ, క్వాంటమ్ ఆవిష్కరణలతో పాటు, ఐటీ ఇతర రంగాల దేశీయ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలో మేటిగా నిలిచింది. 9 నెలల్లో (2025 ఏప్రియల్ –డిసెంబర్) 25.3శాతం పెట్టుబడుల వాటా.. జాతీయ పారిశ్రామిక అధ్యాయానికే గొప్ప మైలురాయని చెప్పొచ్చు. కేవలం 18 నెలల్లో రాష్ట్రానికి 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగావకాశాలు రావడం విజనరీ నాయకుడి వినూత్న పాలనా సంస్కరణల ప్రతిఫలమే అనడం అతిశయోక్తి కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, 25 ప్రధాన పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు ప్రపంచ పారిశ్రామిక వేత్తల దృష్టిని ఏపీవైపు మళ్లేలా చేశాయి. నాడు రాష్ట్రం నుంచి పరిశ్రమలు, పెట్టుబడిదారులు పలాయనబాట పడితే... నేడు పరుగున వచ్చేందుకు పోటీ పడుతుండటం, ప్రగతిసాధకుడైన చంద్రబాబునాయుడి పాలనా దక్షతకు నిదర్శనం.

**నాడు బెదిరింపులు, కక్షసాధింపులు.. నేడు మనసుదోచే పాలసీలు.. సత్వర అనుమతులు.. పన్నురాయితీలు**

వైసీపీ పాలనలో పారిశ్రామికవేత్తలకు బెదిరింపులు.. కక్షసాధింపులు..కమీషన్ల వేధింపులు ఎదురైతే, కూటమి ప్రభుత్వంలో పన్నురాయితీలు, మనసుదోచే పాలసీలు, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు వారిని ఏపీకి వెళ్లే దిశగా ప్రోత్సహిస్తున్నాయి. వచ్చిన ప్రతి పెట్టుబడికి కార్యరూపమిచ్చే దిశగా మంత్రి లోకేశ్ ప్రణాళికాబద్ధంగా పట్టుదలతో పనిచేస్తున్నారు. పెట్టుబడుల ఒప్పందం ఖరారైంది మొదలు తక్కువ ధరకే భూ కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటిపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టి, పారిశ్రామిక వేత్తల మనసు చూరగొంటున్నారు. ప్రభుత్వ పనితీరుతో అనతికాలంలోనే విశాఖ నగరం, డేటా.. ఏఐ హబ్‌గా, అమరావతి క్వాంటమ్ సిటీగా మారడం తథ్యం.. దాంతో సన్ రైజ్ స్టేట్ రూపురేఖలతో పాటు, ఇంటికో పారిశ్రామికవేత్త అన్న పాలకుల లక్ష్యం నెరవేరే సమయం దగ్గరలోనే ఉంది. రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటమే తమ జన్మహక్కుగా భావిస్తూ ప్రతి అభివృద్ధికి కొర్రీలు, కుట్రలు, కోర్టుల్లో కేసులేయిస్తున్న జగన్.. వైసీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలి. ఊరందరిదీ ఒకదారి అయితే.. ఉలిపికట్టెది మరోదారి అన్నట్లుగా కాకుండా.. ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తున్న చంద్రబాబు పాలనా సంస్కరణల్ని జగన్ అండ్ కో మనస్ఫూర్తిగా స్వాగతించాలి. అప్పుడే జగన్ కు, వైసీపీకి రాష్ట్రంలో, రాజకీయాల్లో మనుగడ." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.




# ఘనంగా డాక్టర్ ఉగ్రనరసింహుని ప్రమాణ స్వీకారం

ఒంగోలు, (చైతన్యరథం): ఎస్జీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడుగా డాక్టర్ (గ్రనరసింహ రెడ్డి ప్రమాణస్వీకారోత్సవం కార్యక్రమం ఒంగోలులో ఘనంగా జరిగింది. ముందుగా కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మాజీ జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఏపీటీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ నూతన ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, కమిటీ సభ్యుల అందరితోను ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయులు, ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షులు ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్, దర్శి టీడీపీ ఇంచార్జ్ లక్ష్మీ, ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏపీ సాంస్కృతిక శాఖ చైర్మన్ పొడపాటి తేజస్విని, పిడీసీసీ బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి, జిల్లా గ్రంధాలయం చైర్మన్ ముప్పవరపు సూచరిత, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఆవీజ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈ నెల 7వ తేదీన వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్స్ భూమి పూజకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న సందర్భంగా గంటవానిపల్లి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్ఛార్జ్ గూడూరి ఏరిక్షన్ బాబు





## కలెక్టరేట్‌లో లిఫ్ట్ నిర్మాణ ప్రారంభోత్సవం

ఒంగోలు, (చైతన్యరథం): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లిఫ్ట్ నిర్మాణ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహచర మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామితో కలిసి హాజరైన మంత్రి ఆనం, అనంతరం మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సౌకర్యవంతంగా సేవలు పొందేందుకు ఈ లిఫ్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీ నిధులను వినియోగిస్తున్న మాగుంట శ్రీనివాస్ రెడ్డి ఎంపీకి మంత్రి ఆనం అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు సులభంగా, వేగంగా సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర పరిపాలన మరింత ప్రజాహితంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ఇంచార్జీలు, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పాలనలో సుభిక్షంగా రైతులు

బుచ్చిరెడ్డి పాళెం, (చైతన్యరథం): మండలానికి చెందిన చల్లాయపాళెం 458, పెనుబల్లి 596, పంచేడు 578, దామరమడుగు 752. జొన్నవాడ 268, కలయ కాగొల్లు 334, శ్రీరంగరాజపురం 133, రేబాల 945, నాగమాంబాపురం 269, మినగల్లు 368 కొత్తగా మంజూరైన 4 వేల 713 పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకుఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ తాను ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం అన్నదాతల పాలిట శాపంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రాష్ట ప్రభుత్వ రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల భూములకు సిఎం చంద్రబాబు నాయుడు గారు రైతుల భూములకు భద్రత కల్పించారన్నారు. అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన పట్టాదార్ పాస్ బుక్ పై గల క్యు ఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి వివారాలు తెలుసుకోవచ్చని సర్వే నెంబర్లు, పేర్లలో ఏవైనా పొరపాట్లు దొర్లి వుంటే సరిదిద్దుకోవచ్చు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక దశాబ్దాల తరబడి పూడికలు తీయని కాలువలను కొన్ని ప్రభుత్వ పరంగాను మరికొన్ని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బాగు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించామన్నారు. గతమెన్నడు లేనివిధంగా గిట్టుబాటు ధర కల్పించి, ధాన్య సేకరణ చేసిన 24 గంటలలో రైతుల ఖాతాలలో హమాలీ కూలీలతో సహా వేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మూడు విడతలుగా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణి చేసి సన్నకారు రైతులను ఆదుకున్నాంమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 20 నెలల కాలంలో అమలు చేసిన అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, మత్స్యకార భరోసా, సూక్ష్మశక్తి తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితికి నేటికీ ఎంతో మార్పు వుందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక కాగులపాడు గ్రామంలో 50 లక్షల 70 వేల రూపాయలతో తాగునీరు, రోడ్లు, హాస్పిటల్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భముగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు గుర్తు చేశారు. 2 కోట్ల రూపాయలతో కాగులపాడు జొన్నవాడ లింక్ రోడ్డు మరియు కోవూరు కాలువ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. బుచ్చిరెడ్డి పాళెం తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రంతులయ్య బుచ్చి అగ్రికల్చరల్ బ్యాంక్ ఛైర్మెన్ ఏటూరి శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంక్ డైరెక్టర్ మద్దసాని మాల్యాద్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, బత్తల హరికృష్ణ, కోడూరు కమలాకర్ రెడ్డి, చేనేత సంఘ నాయకులు కెవి శేషయ్య, స్థానిక నాయకులు ఎడెం ప్రసన్న కుమార్ రెడ్డి, రవి నాయుడు, ప్రతాప్ లతో పాటు టీడీపీ యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ ఇంచార్జీలు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వ వైఫల్యం కాదు .. గత పాలకుల ఘాతుకం!

## వాస్తవాలు తెలుసుకోకుండా విషం చిమ్మే రాతలు మానుకోండి: ఎమ్మెల్యే మాధవి హితవు



కడప, (చైతన్యరథం): రిమ్స్ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న 108 వాహనాల దుస్థితికి కూటమి ప్రభుత్వమే కారణమంటూ ఓ పత్రికలో వచ్చిన తప్పుడు కథనాన్ని కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి తీవ్రంగా ఖండించారు. కేవలం పత్రికలో పేజీలు నింపడానికి, ప్రభుత్వంపై బురద చల్లడానికి వాస్తవాలను దాచిపెట్టి వార్తలు రాయడం సిగ్గుచేటని ఆమె మండిపడ్డారు. పత్రికలో ప్రచురించిన ఆ వాహనాలు ఈరోజు పాడైనవి కావని, గత ఐదు, ఆరు సంవత్సరాల నుండి గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అవి రిమ్స్ ఆవరణలో తుప్పుపట్టి పోయాయని ఆమె స్పష్టం చేశారు.

తాను 2023లో ప్రతిపక్షంలో ఉండి ప్రచారం చేస్తున్నప్పుడే ఆ వాహనాల దుస్థితిని ఫోటోలు తీయడం జరిగిందని, నాడు వాటిని రిపేర్లు చేయించకుండా, కనీసం స్పేర్ పార్ట్స్ దొంగలు ఎత్తుకెళ్తున్నా పట్టించుకోని గత పాలకులు, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కడప నగరానికి 6 కొత్త అంబులెన్స్ లు మంజూరు చేసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిందని, సూపర్ సిక్స్ పథకాలతో ప్రభుత్వం బ్రహ్మాండంగా ముందుకు వెళుతుంటే ఓర్వలేక ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు పత్రికకు చిత్తశుద్ధి ఉంటే, 2019లో చంద్రబాబు నాయుడు గారు ఎస్సీ, ఎస్టీల స్వయం ఉపాధి కోసం కేంద్ర నిధులతో మంజూరు చేసిన ట్రాక్టర్లు, ప్రొక్లైన్లు, ఆటోలను కేవలం బాబు గారికి పేరు వస్తుందనే అక్కసుతో మహిళా ప్రాంగణంలో పడేసి, నిరుపయోగంగా మార్చిన గత పాలకుల పాపం గురించి వార్త రాయాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో ఆ వాహనాల టైర్లు, బ్యాటరీలు దొంగలపాలైనప్పుడు ఈ పత్రిక ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.రిమ్స్ లో (స్క్రాప్ కింద మారిన వాహనాలను తొలగించి, ఆ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే కలెక్టర్ గారితో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఆమె తెలిపారు. అనవసరంగా తప్పుడు రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఇకనైనా వాస్తవాలు తెలుసుకుని బాధ్యతాయుతమైన వార్తలు రాయాలని ఎమ్మెల్యే మాధవి హితవు పలికారు.



అనంతపురం పట్టణానికి చెందిన శ్రీనివాసులు చెల్లగొండ్లకి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కును అందజేసిన హిందూపురం పార్లమెంటు సభ్యు డు బీకే పార్థసారథి

# కూటమి పాలనలో రెవెన్యూ సంస్కరణలు



అమరావతి, (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రజలకు తమ భూములపై భరోసాను కల్పించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను అందిస్తోందని ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్ తో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను రూపొందించి ఎలాంటి లోపాలు లేకుండా రీ-సర్వే ప్రక్రియను పూర్తి చేసిన 7200 గ్రామాల పరిధిలోని 23 లక్షల మందికి ఈ నెల 9వ తేదీ వరకు పంపిణీ చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు. అమరావతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త పాస్ పుస్తకాల పంపిణీతో 23 లక్షల మందికి వారి ఆస్తులపై నమ్మకాన్ని, భరోసాను కల్పిస్తున్నామన్నారు ప్రజల ఆస్తిపై తమకు హక్కు ఉందన్నట్టుగా గత ప్రభుత్వం నాటి సీఎం జగన్ రెడ్డి ఫొటోలను భూమి హక్కు పత్రాలపై ముద్రించిందని. వాటిని కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని. కూటమి ప్రభుత్వం ఇస్తున్న కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలపై గత ప్రభుత్వం మాదిరిగా రాజకీయ నేతల ఫొటోలను వేయలేదని.ప్రజల ఆస్తులపై రాజకీయ నేతల బొమ్మలు, స్టిక్కర్లు ఉండకూడదనే ఉద్దేశ్యంతో కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు రూపొందించామని. కూటమి ప్రభుత్వం భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రభుత్వమే కానీ. ప్రజల ఆస్తులపై బొమ్మలు వేసుకునే ప్రభుత్వం కాదని ప్రజలంతా గుర్తించాలని ఆయన తెలిపారు గత ప్రభుత్వం ప్రజల ఆస్తులను. భూములను వివాదాల్లోకి నెట్టేసేలా రీసర్వే- 1.0 చేపట్టిందని.ఆ రీ-సర్వే అంతా తప్పుల తడగా ఉండడంతో రైతుల ఆందోళనలను తప్పించేలా కూటమి ప్రభుత్వం గ్రామ సభలు పెట్టిందని. గత ప్రభుత్వం రీ--సర్వే చేపట్టిన 6688 గ్రామాల్లో సభలు నిర్వహించి వచ్చిన ఫిర్యాదుల మేరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని. 2,79,712 అర్జీలు రాగా 100 శాతం పరిష్కరించామని ఆయన తెలిపారు. రీ సర్వే పూర్తైన గ్రామాల్లో జాయింట్ ఎల్పీఎమ్ లను సబ్ డివిజన్ చేయించుకునేందుకు రైతులకు సబ్ డివిజన్ ఫీజును కూడా మాఫీ చేశామని ఆయన తెలిపారు. దీంతో పాటు మొదటి విడత లో భాగంగా మరికొన్ని గ్రామాల్లో కూడా ప్రభుత్వం రీ- సర్వే చేపట్టిందని ఆయన తెలిపారు ఎలాంటి వివాదాలు లేకుండా భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు రీ సర్వే - 2. 0 ను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందని రైతులను భాగస్వాములను చేసి తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే చేపడుతుందని తెలిపారు.

# ఉల్లి రైతు కన్నీరు తుడిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు

## ధన్యవాద తీర్మాన సభలో వ్యవసాయమంత్రి , ఎమ్మెల్యేల కృతజ్ఞతలు



కోడుమూరు, (చైతన్యరథం): కోడుమూరు టౌన్ లో ఉల్లిగడ్డ రైతులకు ఆర్థిక సహాయం అందించడం వల్ల కూటమి ప్రభుత్వానికి ఉల్లిగడ్డ రైతులు ధన్యవాద తీర్మాన సభలో వ్యవసాయ శాఖా మాత్యులు కింజరాపు అచ్చంనాయుడుతోపాటు ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చంనాయుడు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో అత్యధికంగా 60000 వేల ఎకరాల్లో ఉల్లి ని రైతులు సాగు చేశారన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాలు బాగా పడి పంటలు బాగా పండి భారీ దిగుబడి జరిగింది కానీ మార్కెట్లో సరైన గిట్టుబాటు ధర లేక రైతులకు కనీస పెట్టుబడి పెట్టిన డబ్బులు రాక రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి మార్క్ఫెడ్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేయమని ఆదేశాలిచ్చారన్నారు. 1,68,936 లక్షల క్వింటాలు కొనుగోలు చేశామన్నారు. తర్వాత ఉల్లి పెద్ద ఎత్తున సాగు చేయడం, దిగుబడి కూడా భారీగా పెరగడం, మార్కెట్లో డిమాండ్ లేకపోవడం వల్ల రైతులకు నష్టపరిహారం అందజేయాలని భావించి, కర్నూలు జిల్లాలో సుమారుగా 31,352 మందికి 99.92 కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు.కూటమి రైతు ప్రభుత్వమని మరోసారి రుజువైందని తెలియజేశారు. కేడీసీసీ ఛైర్మెన్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ం సుమారు 100 కోట్ల నష్ట పరిహారం అందించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, వ్యవసాయ శాఖ మాత్యులు కింజరాపు అచ్చంనాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. అలగే కోడుమూరు నియోజకవర్గానికి ముఖ్యంగా త్రాగు సాగు నీరు సమస్య ఉందని ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా కోడుమూరు నియోజకవర్గానికి అభ్యర్థిగా కీ శే శ్రీ. రాజవర్ధన్ రెడ్డికి ఆప్తుడు బొగ్గుల దస్తగిరి సిఫార్సు చేయగా నారా లోకేష్, చంద్రబాబు నాయుడు టికెట్ ఇచ్చారని ఇచిన వెంటనే జిల్లాలో అత్యధిక మెజారిటీ తో గెలుపొందడం జరిగిందని అన్నారు. అయితే నియోజకవర్గంలో ఇప్పటికీ ఒక్క డైరెక్టర్ పోస్ట్ కూడా దక్కలేదని అయిన కూడా పదవుల కోసం ఎప్పుడూ ఆరాటపడం లేదని ఈ నియోజక వర్గ ప్రజలకి ఎల్లపుడు సేవ చేస్తాను పార్టీని బలోపేతం కోసం ఎప్పటికీ కృషి చేస్తానని పేర్కొన్నారు . మంత్రి భరత్ మాట్లాడుతూ 100 కోట్లు అందించడం పట్ల సీఎం చంద్రబు నాయుడుకి ధన్యవాదాలు తెలిపారు. కోడుమూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ మా నియోజకవర్గంలో 8890 ఉల్లి రైతులకు సుమారు 28 కోట్లను ఆర్థిక సాయం చేయడం పట్ల ముఖ్యమంత్రివర్యులు నారాచంద్రబాబు నాయుడు, కింజరాపు అచ్చంనాయుడుకి ధన్వదాలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఉల్లి ధరలు తగ్గినప్పుడు ఉల్లిని అమ్ముకోకుండా నిల్వ చేసుకొని మరల ఉల్లి రేటు బాగా ఉన్నపుడు అమ్ముకోవడానికి అవసరమైన ఏసీ గోడౌన్స్ నిర్మించాలని వ్యవసాయ శాఖ మాత్యులు వారికి విజ్ఞప్తి చేశారు. చివరగా రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది రైతు సమస్యలను సమిష్టిగా పరిష్కరిస్తే స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలియజేసి తన ప్రసంగాన్ని ముగించడమైనది. జిల్లాలో మిగతా నియోజవర్గ ఎంఎల్ఏ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని అందుకే ఉల్లి రైతులు నష్టపోకుండా 31,352 రైతులకు 99.92 కోట్ల రూపాయలను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కర్నూలు జిల్లా తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, ఎమ్మిగనూర్ ఎమ్మెల్యే జయనగేశ్వరరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు టీడీపీ ఇంచార్జి వైకుంఠం జ్యోతి, జిల్లా టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు ముఖ్యంగా కోడుమూరు నియోజకవర్గ టీడీపీ నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



నెల్లూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

# రోడ్డు విస్తరణలో సొంత మామ ఇంటినే కూల్చేశాం

## సతీమణి సాక్షిగా వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



పని విషయంలో తనకు అందరూ సమానమేనని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. గతంలో ఒకసారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టినప్పుడు అడ్డుగా ఉన్న తన సొంత మామ ఇంటినే తొలగించినట్లు వెల్లడించారు. ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫరా తన కుక్ దిలీప్‌తో కలిసి ఢిల్లీలోని గడ్కరీ నివాసాన్ని సందర్శించారు. ఈ క్రమంలో గడ్కరీ తన సతీమణి కాంచన్‌తో కలిసి ఫరా ఖాన్ బ్లాగ్లో పాల్గొన్నారు. తమ గ్రామంలో రోడ్డు వేయాల్సిందిగా ఫరా ఖాన్ కుక్ దిలీప్ వ్లాగ్లో గడ్కరీని అభ్యర్థించాడు. దీంతో అతడి ఇంటి మీదుగా రోడ్డు వేయాలని ఫరాఖాన్ చమత్కరించారు. అక్కడే ఉన్న మంత్రి సతీమణి కాంచన్ మాట్లాడుతూ ఒక ఘటనను వెల్లడించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉందని తన తండ్రి ఇంటినే కూల్చేశాడని పేర్కొనడంతో అక్కడి వారు ఆశ్చర్యపోయారు. దీనిపై నితిన్ గడ్కరీ వివరణ ఇస్తూ.. గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో సొంత మామ ఇంటినే కూల్చివేసినట్లు తెలిపారు. మరి తర్వాత కొత్త ఇల్లు కట్టించారా అని ఫరాఖాన్ అడగగా.. ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందించే పరిహారం మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ బ్లాగ్లో తన జీవితంలోని పలు ఆసక్తికరమైన విషయాలను కూడా కేంద్రమంత్రి పంచుకున్నారు.

# చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ : 14 మంది మావోయిస్టుల మృతి



చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్ కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిస్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామ సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపూర్ జిల్లాలో జరిగిన మరో ఎన్ కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్ కౌంటర్లలో 285 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు.

# ధర్మశాల ప్రభుత్వ కళాశాలలో దారుణం


## ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు విద్యార్థిని బలి



సీనియర్ల ర్యాగింగ్, ప్రొఫెసర్ లైంగిక వేధింపుల కారణంగా హిమాచల్‌ప్రదేశ్లో ఓ విద్యార్థిని మృతి చెందడంపై తీవ్ర దుమారం రేగుతోంది. ఈ ఘటనను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీవ్రంగా పరిగణించింది. ఈ కేసుపై ఉన్నతస్థాయి విచారణ జరపాలని ఆదేశించింది. ఇందుకుగాను ఒక నిజ నిర్ధరణ కమిటీని ఏర్పాటుచేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. ధర్మశాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషాదకర ఘటనను తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని యూజీసీ సీనియర్ అధికారి తెలిపారు. ర్యాగింగ్ వల్లే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందనే మీడియా నివేదికల ఆధారంగా సుమోటోగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అయితే, విద్యార్థినిది ఆత్మహత్య కాదని.. సాధారణ మరణం అని కళాశాల అధికారులు పేర్కొన్నట్లు వివరించారు. ఈ ఘటనపై పోలీసు విచారణ కొనసాగుతోందని.. యూజీసీ ఒక నిజ నిర్ధరణ కమిటీని ఏర్పాటుచేసిందన్నారు. దోషులను వదిలిపెట్టమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమన్నారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న బాధితురాలిపై ముగ్గురు సీనియర్ విద్యార్థినులు ర్యాగింగు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఆమెపై దాడి చేశారు. మరోవైపు ప్రొఫెసర్ అశోక్ కుమార్ ఆ విద్యార్థినిని లైంగికంగా వేధించేవాడు. దాడిలో గాయపడిన బాధితురాలు చికిత్స పొందుతూ గత నెల 26న ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులను, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# రేహాన్ వాద్రా వివాహ నిశ్చితార్థం

## ధృవీకరించిన తల్లి ప్రియాంక గాంధీ



కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీ, పారిశ్రామికవేత్త రాబర్ట్ వాద్రాల కుమారుడు రేహాన్ వాద్రాకు ఎంగేజ్ మెంట్ జరిగినట్లు ఇటీవల జాతీయ మీడియాలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ తాజాగా ప్రియాంక గాంధీ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. రేహాన్, ఆయన పెళ్లి చేసుకోబోయే అవీవా బేగ్ చిన్నప్పటినుంచి మంచి స్నేహితులని తెలిపారు. వారి ఫొటోలను కూడా పంచుకున్నారు. రేహాన్ తన ఎంగేజ్‌మెంట్ ఫొటోలను ఇన్స్టాలో పంచుకున్నారు. అందులో అవీవాబేగ్‌తో కలిసి ఉన్న చిన్ననాటి ఫొటో కూడా ఉంది. రాజస్థాన్ రణతంబోర్లో అత్యంత సన్నిహిత కుటుంబసభ్యుల సమక్షంలో ఈ వేడుక జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గత ఏడేళ్ల నుంచి రేహాన్, అవీవాలు ప్రేమలో ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రేహాన్ గతవారం పెళ్లి ప్రతిపాదన తీసుకురాగా.. దానికి ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. మరికొన్ని నెలల్లోనే వీరి వివాహం కూడా జరగనున్నట్లు సమాచారం. రేహాన్ వాద్రా విజువల్ ఆర్టిస్ట్, వైల్డ్‌లైఫ్, స్ట్రీట్, కమర్షియల్ ఫొటోగ్రఫీతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అవీవా కూడా ఫొటోగ్రాఫర్. ఓ ఫొటోగ్రఫిక్ స్టూడియో, ప్రొడక్షన్ కంపెనీకి సహ వ్యవస్థాపకురాలిగా వ్యవహరిస్తున్నారు.

# మహారాష్ట్రలో మహాఘోరం

## ప్రసవం కోసం ఆరు కిలోమీటర్లు నడిచి బిడ్డతో సహా మృతి చెందిన గర్భిణి



మహారాష్ట్రలోని గడ్చిరోలిలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు మార్గం, వైద్య సదుపాయాలు సరిగా లేకపోవడంతో ఓ నిండు గర్భిణి ప్రసవం కోసం 6 కిలోమీటర్లు నడిచి ఓపిక నశించి ఆ మహిళ కూడా ప్రాణాలు కోల్పోయింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటపల్లి తాలూకాలోని ఆల్డండి టోలా గ్రామానికి చెందిన ఆశా సంతోష్ కిరంగ (24) తొమ్మిది నెలల నిండు గర్భిణీ. ఆమె స్వగ్రామంలో రోడ్డు మార్గమే కాదు, వైద్య సదుపాయాలు కూడా లేవు. దీంతో డెలివరీ కోసం తన భర్తతో కలిసి అడవి మార్గంలో దాదాపు 6 కి.మీలు నడుచుకుంటూ వెళ్లి పెదాలో ఉన్న తన సోదరి ఇంటికి చేరుకుంది. ఈ క్రమంలో ఆమెకు పురిటి నొప్పులు మొదలవడంతో కుటుంబసభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావమవడంతో కడుపులోనే శిశువు ప్రాణాలు కోల్పోయింది.. రక్తపోటు పెరగడంతో మహిళ కూడా మరణించింది. ఈ ఘటనపై జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రతాప్ షిండే స్పందించారు. వైద్యులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆమె మృతిపై తాలూకా ఆరోగ్య అధికారి నుంచి వివరణ కోరినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై విచారణ జరుపుతామన్నారు.

# ఎన్సీసీ ప్రణాళికతో సైబర్ నేరాలకు చెక్



సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాలను అనుసరిస్తూ అమాయక ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఇలాంటి మోసాలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నా... ఇంకా పలువురు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారు. ఈ నేరాలకు చెక్ పెట్టేలా ఎన్సీసీ ప్రణాళికలు రచిస్తోంది. 10వేల మంది క్యాడెట్లతో సైబర్ వారియర్స్‌ను ఏర్పాటుచేయాలని ప్రణాళికలు చేస్తున్నట్లు ఎన్సీసీ డీజీ లెఫ్ట్‌నెంట్ జనరల్ వీరేంద్ర వత్స్ వెల్లడించారు. వీరిని నేషనల్ డేటాబేస్తో లింక్ చేయనున్నారు. దీంతోపాటు ప్రకృతి విపత్తుల సమయంలో వేగంగా స్పందించేందుకు లక్ష మంది క్యాడెట్లకు 'యువ ఆపద మిత్ర'లుగా శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. వీరిని కూడా డేటా బేస్ అనుసంధానిస్తామని చెప్పారు. దానివల్ల ఏదైనా విపత్తు సంభవించినప్పుడు వారి సేవలను వినియోగించుకునే వీలు ఉంటుందని ఢిల్లీలో నిర్వహించిన మీడియా కార్యక్రమంలో తెలిపారు. దేశవ్యాప్తంగా నాలుగైదు హబ్స్ ఏర్పాటుచేసి, ఇక్కడ ఎంపిక చేసిన క్యాడెట్లకు డ్రోన్, కౌంటర్ డ్రోన్ అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్సీసీకి చెందిన పరేడ్ అండ్ కంటింజెంట్ కమాండర్లు తొలిసారి కత్తితో మార్చ్ చేయనున్నారు.

# పురపోరులో సీఎం మహాయుతికి జాక్‌పాట్ : ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో గెలుపు



మహారాష్ట్ర పురపోరులో అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేత్రృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్నాథ్ శిండే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేత్రృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఏకగ్రీవ విజయాలపై అధికార ప్రభుత్వం ఆనందం వ్యక్తంచేసింది. ఈ విజయాలపై శివసేన పార్టీ (ఉద్ధవ్ ఠాక్రే) స్పందిస్తూ.. ఈడీ వంటి కేంద్ర సంస్థలను అడ్డుగా పెట్టుకొని ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించడం, లంచం ఇవ్వడంతో ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కారని ఆరోపించింది. ఇక, బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 28 కార్పొరేషన్లకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

# కివీస్‌తో వన్డేలకు భారత జట్టు ప్రకటన

## శ్రేయాస్‌కు చోటు, రుతురాజ్‌కు నిరాశ



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ కోసం భారత జట్టులో శ్రేయాస్‌అయ్యర్‌కు చోటు లభించింది. టీమిండియాతో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం త్వరలో భారత పర్యట నకు న్యూజిలాండ్ రానుంది. జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్, 21 నుంచి టీ20 సిరీస్ మొదలుకానున్నాయి. కివీస్‌తో వన్డే మ్యాచ్‌ల కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శనివారం జట్టును ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్‌కు చోటు కల్పించినప్పటికీ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) నుంచి ఫిట్నెస్ క్లియరెన్స్ వస్తేనే అతను మ్యాచులు ఆడతాడని స్పష్టం చేసింది. ఒక మ్యాచ్‌లో 10ఓవర్లు బౌలింగ్ చేయడానికి హార్దిక్ పాండ్యకు సీవోఈ నుంచి క్లియరెన్స్ రాక పోవడం, టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని కివీస్‌తో వన్డేలకు అతడికి విశ్రాంతి ఇచ్చారు. రిషభ్ పంత్,యశస్వి జైస్వాల్‌ను జట్టులో కొనసాగించారు. రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేయ కపోవడం ఆశ్చర్యం కలిగించే అంశం.దేశవాళీల్లో సత్తా చాటుకున్న సీనియర్ పేసర్ మహ్మద్ షమికి మరోసారి నిరాశే ఎదురైంది. వన్డే సిరీస్ తర్వాత జరిగే టీ20లకు భారత జట్టును ఇప్పటికే ఎంపిక చేశారు. వచ్చేనెలలో ఆరంభమయ్యే టీ20ప్రపంచకప్ కోసం ఎంపిక చేసిన జట్టునే ఆ సిరీస్‌లో కొనసాగించనున్నారు.

కివీస్‌తో వన్డేలకు భారత జట్టు: శుభ్మన్ గిల్ (కెప్టెన్),రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లి, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషభ్ పంత్, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.

**న్యూజిలాండ్ మూడు వన్డేల షెడ్యూల్**

జనవరి 11 తొలి వన్డే (వడోదర), జనవరి 14 రెండో వన్డే (రాజ్‌కోట్), జనవరి 18 మూడో వన్డే (ఇండోర్)

అయ్యర్‌కు లైన్ క్లియర్..

భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలోకిఅడుగుపెట్టనున్నాడు.బీసీసీఐ సీవోఈలో ఇంటెన్సివ్ రిహాబ్‌బ్లాక్‌ను శ్రేయస్ పూర్తిచేసు కున్నాడు. గతేడాది అక్టోబర్ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో క్యాచ్ అందుకునే క్రమంలో శ్రేయస్‌కు తీవ్రమైనగాయమైంది.దీంతో తర్వాత జరిగిన మ్యాచ్‌లకు అయ్యర్ దూరమయ్యాడు. డిసెంబర్ 25న సీవోఈలో చేరిన శ్రేయస్.. స్ట్రెంత్ అండ్ కండీషనింగ్‌లో పురోగతి సాధించాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో నాలుగు సెషన్లపాటు కఠినమైన సాధన పూర్తి చేశాడు. మ్యాచ్ సిమ్యులేషన్ సెషన్స్‌లోనూ పాల్గొన్నాడు. దీంతో జట్టులో చోటు దక్కించుకున్నాడు.

ఈ నేపథ్యంలో విజయ్ హజారే ట్రోఫీలో ఆడటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జనవరి 6న హిమచల్ ప్రదేశ్తో జరిగే మ్యాచ్‌లో ముంబయి తరపున శ్రేయస్ బరిలోకి దిగనున్నాడు. ఆ మ్యాచ్ లో అతను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడితే పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ సాధించినట్లుగా పరిగణిస్తారు. విజయ్ హజారే ట్రోఫీలో ముంబయి ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. ఆ జట్టు నాకౌట్ దశకు అర్హత సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### హార్దిక్ సెంచరీ చేసినా..

# బరోడాకు తప్పని ఓటమి



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా రాజ్‌కోట్ వేదికగా విదర్భతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అద్భుత సెంచరీ చేసినప్పటికీ బరోడా ఓటమి పాలయింది. టాస్ గెలిచిన విదర్భ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బరోడా జట్టు బ్యాటింగ్‌కి దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 293 పరుగులు చేసింది. బరోడా తరపున ఆడిన హార్దిక్ పాండ్య(133, 92 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్సులు) సెంచరీతో చెలరేగాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో హార్దిక్ పాండ్య కు ఇది తొలి సెంచరీ కావడం గమనార్హం. 38వ ఓవర్ వరకు 62 బంతుల్లో 66 పరుగులు మాత్రమే చేసిన హార్దిక్.. 39వ ఓవర్లో వరుసగా 5 సిక్సులు, ఒక ఫోర్ బాది సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మిగతా బ్యాటర్లంతా పరుగులు చేయడంలో విఫలమయ్యారు. ఏ ఒక్క బ్యాటర్ కూడా 30 పరుగుల మార్క్‌ను దాటలేకపోయారు. సొలంకీ 26, కృనాల్ పాండ్య 23, షెత్ 21 మాత్రమే ఓ మోస్తరు పరుగులు చేశారు.

విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4, పార్థ్, నచికేత్‌లు చెరో 2, ప్రఫుల్ 1 వికెట్ తీసుకున్నారు.

అనంతరం 294 పరుగుల లక్ష్య ఛేదనలో విదర్భ ఒక వికెట్ మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. ఆ జట్టు ఓపెనర్ అమన్ మోఖడే (150 నాటౌట్, 121 బంతుల్లో, 17 ఫోర్లు, 4 సిక్సులు) చెలరేగి ఆడాడు. అథర్వ తైడే (65), ధ్రువ్ షోరే (65 నాటౌట్) అర్ధసెంచరీలు సాధించారు.

# ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ ఔట్

### - విడుదల చేయాలని కేకేఆర్‌కు బీసీసీఐ ఆదేశం



అనుకున్నదే అయిందే.. ఎన్నో విమర్శలు.. ఆరోపణలు.. వీటన్నింటి నడుమ బంగ్లాదేశ్ ఆడగాడిని ఐపీఎల్ ఫ్రాంఛైజీలోని కేకేఆర్ జట్టు దక్కించుకోలేక పోయింది.పొరుగు దేశంలో మత అల్లర్లు, హింసాత్మక ఘటనలు, రాజకీయ అస్థిరత నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్‌లోకి తీసుకోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది.బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను జట్టు నుంచి విడుదల చేయాలని ఐపీఎల్ ఫ్రాంచైజీ కేకేఆర్‌ను బీసీసీఐ ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల నేపథ్యంలో ముస్తాఫిజుర్‌ను ఐపీఎల్‌లో ఆడించొద్దని డిమాండ్లు వినిపించిన నేపథ్యంలో బీసీసీఐ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది.'బంగ్లాదేశ్‌లో తాజాపరిణామాల దృష్ట్యా ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీజ్ చేయాలని కేకేఆర్‌ను ఆదేశించాం.అతడి స్థానంలో వేరే ఆటగాడిని రిప్లేస్ చేసుకోవచ్చని వెల్లడించాం' అని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా చెప్పారు.

ఇటీవలే జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో చెన్నైతో పోటీ పడి మరీ ముస్తాఫిజుర్‌ను రూ.9.2 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసిన విషయంతెలిసిందే. ఐపీఎల్‌లో అత్యధిక ధరకు అమ్ముడైన తొలి బంగ్లా ప్లేయర్‌గా ముస్తాఫిజుర్ చరిత్ర సృష్టిస్తాడనుకునే లోపే బీసీసీఐ ఈనిర్ణయం తీసుకుంది. రెహమాన్ 2016లో ఐపీఎల్లోకి ఎంట్రీ ఇచ్చాడు.ఇప్పటివరకు 60మ్యాచ్‌లు ఆడి 65వికెట్లు తీసుకున్నాడు.

**ఆ మొత్తం తిరిగొస్తుందా?**

ముస్తాఫిజుర్ ఒక్క బంతిని కూడా బౌల్ చేయకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించినట్ల యింది. అయితే అతడికోసం కేకేఆర్ వెచ్చించిన ఆ రూ.9.20 కోట్లు వారి పర్సుకు తిరిగి చేరతాయా.. లేదా అనేసందేహాలు నెలకొన్నాయి.ఈ విషయంలో ఐపీఎల్ వేలం నిబంధనల మేరకు.. ఏదైనా ఫ్రాంచైజీ ఒక్కసారి ఆటగాడిని వేలంలో దక్కించుకుంటే.. దాని పర్స్ నుంచి ఆ మొత్తం మైనస్ అవుతుంది. అయితే ప్రస్తుతం ముస్తాఫిజుర్ అంశం ప్రత్యేకమైంది. అలాగే తప్పనిసరిగా అతన్ని రిలీజ్ చేయమని బీసీసీఐ ఆదేశించింది. భారత క్రికెట్ బోర్డు జోక్యంతో, క్రికెట్‌కు సంబంధం లేని కారణాలతో ముస్తాఫిజుర్ జట్టుకు దూరమయ్యాడు. కాబట్టి ఐపీఎల్ నిబంధనల ప్రకారం కేకేఆర్ పర్స్‌లోకి ఆ మొత్తం వచ్చి చేరుతుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీ.. ముస్తాఫిజుర్ రెహమాన్ స్థానంలో మరో ఆటగాడిని తీసుకోవడానికి అనుమతిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ధ్రువీకరించారు. కానీ.. ఆ నిధులు ఎప్పుడు?... ఎలా.. కేకేఆర్ తిరిగి పొందుతుందో ఆయన ప్రత్యేకంగా వివరించలేదు. అయితే మొత్తానికి కేకేఆర్ పర్స్‌లో త్వరలోనే రూ.9.20 కోట్లు వచ్చి చేరే అవకాశముంది. డెత్ ఓవర్ల స్పెషలిస్ట్‌గా పేరున్న ముస్తాఫిజుర్ స్థానాన్ని కేకేఆర్ ఏ ఆటగాడితో భర్తీ చేయనుందనే విషయంలో మాత్రం ఆసక్తి నెలకొంది. అయితే డెత్ ఓవర్లలో ముస్తాఫిజుర్ స్థాయిలో ప్రభావం చూపగల బౌలర్‌ను దొరకబెట్టడం మాత్రం అంత సులువు కాదని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఇలాఉంటే ముస్తాఫిజుర్.. కేకేఆర్, బీసీసీఐ నుంచి పరిహారం డిమాండ్ చేసే అవకాశం ఉంది. అదే జరిగితే పరిస్థితి ఏంటనే అంశం ప్రస్తుతం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### అర్ష్‌దీప్ మెరుపులు..

## సిక్కింపై పంజాబ్ ఘన విజయం



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన పంజాబ్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో సిక్కిం తొలుత బ్యాటింగ్‌కి దిగింది. పంజాబ్ తరఫున బరిలోకి దిగిన టీమిండియా యువ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ విజృంభించడంతో సిక్కిం జట్టు విలవిల్లాడింది. కేవలం 22.2 ఓవర్లకే ఆ జట్టు కుప్పకూలింది. అర్ష్‌దీప్ బౌలింగ్ ధాటికి ప్లేయర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టారు. 75 పరుగులకే సిక్కిం ఆలౌటైంది. తమంగ్(13), గురిందర్ సింగ్(10), సప్తుల్లా(10) వీరే టాప్ స్కోరర్స్. అర్ష్‌దీప్ సింగ్ 5 వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. సుఖ్‌దీప్, మార్కండే తలో రెండు, బ్రార్ ఒక వికెట్ పడగొట్టాడు.

76 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన పంజాబ్ కేవలం 6.2 ఓవర్లలో ఆటను ముగించింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 81 పరుగులు చేసింది. దీంతో పది వికెట్ల తేడాతో సిక్కింపై ఘన విజయం సాధించింది. ఓపెనర్లు హర్నూర్ సింగ్(22), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(53) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. ఇద్దరూ నాటౌట్‌గా నిలిచారు.

# సిడ్నీ టెస్ట్‌కు భారీ భద్రత



యాషెస్ సిరీస్‌లో భాగంగా ఐదో టెస్ట్ మ్యాచ్ సిడ్నీ వేదికగా ఆదివారం ప్రారంభం కానుంది. ఇటీవలే ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్ లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిడ్నీ మైదానం లోపల, వెలుపల భద్రత కట్టుదిట్టం చేశారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, సాయుధులైన పోలీసులు గస్తీ కాస్తారని న్యూసౌత్ వేల్స్ పోలీసు కమిషనర్ మాల్ లాన్యోన్ శనివారం తెలిపారు. మెల్బోర్న్‌లో నాలుగో టెస్ట్ జరిగిన నేపథ్యంలో తీసుకున్న పటిష్ట చర్యలనే సిడ్నీలోనూ కొనసాగించనున్నారు. పోలీసులు మైదానంతో పాటు, సమీపంలోని పార్క్, రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పహారా కాస్తున్నారు.

గత సంవత్సరం డిసెంబర్ 14న ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులు జరిపి 15 మంది మృతికి కారణమైన ఉగ్రవాది నవీద్ అక్రమ్‌పై పోలీసులు 59 అభియోగాలను నమోదు చేశారు. అందులో 15 హత్య కేసులున్నాయి. మరో ఉగ్రవాది సాజిద్ హతం కావడంతో నవీద్ ఒక్కడి పైనే ఈ అభియోగాలను పోలీసులు మోపిన విషయం తెలిసిందే. చనిపోయిన ప్రతిఒక్కరి హత్యకు కారణమంటూ పోలీసులు విడివిడిగా అతడిపై 15 కేసులు నమోదు చేశారు. కాల్పులకు సంబంధించి 40 కేసులు పెట్టారు. పేలుడు పదార్థాలు తదితర నేరాలపై మరో నాలుగు కేసులు నమోదు చేశారు.

ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్లో భాగంగా ఆస్ట్రేలియా ఇప్పటికే సిరీస్ ను కైవసం చేసుకుంది. ప్రస్తుతం 3-1 ఆధిక్యంలో ఉంది. మెల్బోర్న్ టెస్ట్‌లో నాలుగు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. చివరి మ్యాచ్లోనూ గెలిచి.. సిరీస్‌ను విజయంతో ముగించాలని ఆ జట్టు చూస్తోంది. నాలుగో టెస్ట్ రెండు రోజుల్లోనే ముగిసిన నేపథ్యంలో ఐదో మ్యాచ్ జరగనున్న సిడ్నీలో పిచ్ ఎలా స్పందిస్తుందోనని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 4 జనవరి 2026


# 'మన శంకర వరప్రసాద్' టీమ్ ఇదే

మెగాస్టార్ చిరంజీవి కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. వెంకటేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ మూవీ విడుదల కానుంది. చిత్ర ప్రచారంలో భాగంగా వరప్రసాద్ టీమ్ అంటూ తాజాగా పోస్టర్ విడుదలైంది. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం, తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్ లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్ లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం వరుసగా తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో



చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. సినిమా ప్రచారాన్ని మరోస్థాయికి తీసుకెళ్లే అనిల్ రావిపూడి అండ్ బృందానికి ఈ 9 రోజులు నిజంగా ఒక ఛాలెంజ్ అనే చెప్పాలి.

## భీమవరం బీట్ సాంగ్‌లో రఘురామ..




ఒకప్పుడు రీమిక్స్‌పాటలతో అలరించిన స్మిత ఇప్పుడు ఈతరాన్ని మెప్పించేలా సరికొత్త ఆల్బమ్స్‌తో సందడిచేస్తున్నారు. ఇటీవల 'మసక మసక చీకటిలో' అంటూ పాత పాటలను కొత్తగా క్రియేట్ చేసింది. తాజాగా ఆమె 'భీమవరం బీట్' అంటూ మరో పాటను పంచుకున్నారు. ర్యాప్ సింగర్ నోయల్‌తో కలిసి చేసిన ఈ వీడియోలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణం రాజు కూడా మెరిశారు. అంతేకాదు, స్మితతో కలిసి స్టెప్ వేశారు.

## కొత్త లుక్‌లో చైతన్యరావు

చైతన్యరావు మదాడి కథానాయకుడిగా కె.క్రాంతి మాధవ్ దర్శకత్వంలో రూపొందుతోన్న అత్యంత మొరటు సినిమా 'దిల్ దియా'. 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. శ్రియాస్ చిత్రాస్, ఎ పూర్ణనాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేసి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను గమనిస్తే.. బట్టలు లేకుండా సోఫాలో కూర్చున్న చైతన్య రావును చూడొచ్చు. రగ్డ్ లుక్‌తో సీరియస్‌గా చూస్తున్నాడు. తన చూపుల్లోని ఇంటెన్సిటీ తన పాత్రలోని సీరియస్‌నెస్‌ను తెలియజేస్తోంది.

నిర్మాత పూర్ణ నాయుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్, సెన్సిబుల్ సినిమాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు క్రాంతి మాధవ్.. మరోసారి 'దిల్ దియా'తో సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించటానికి సిద్ధమవుతున్నారు. చైతన్యరావు మదాడిని న్యూ అవతార్‌లో చూడబోతున్నారు. రా ఎమోషన్స్‌ను అందరికీ కనెక్ట్ అయ్యేలా రూపొందిస్తున్నాం. ప్రేమ, మమకారం, వైఫల్యం, స్వీయ గౌరవం వంటి ఎలిమెంట్స్‌ను సినిమాటిక్ లాంగ్వేజ్‌లో దర్శకుడు ఆవిష్కరిస్తున్నారు. 'దిల్ దియా'ను సమ్మర్‌లో విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నాం" అన్నారు

## రజనీ-కమల్ సినిమా దర్శకుడిగా శిబి




అగ్ర కథానాయకుడు రజనీకాంత్ 173వ చిత్రానికి సంబంధించి బిగ్‌అప్డేట్ వచ్చింది. ప్రముఖ నటుడు కమల్ హాసన్ నిర్మాణ సారథ్యంలో ఈ ఇద్దరు స్టార్లు కలిసి నటించనున్న ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలుచేపట్టే అవకాశం యువ డైరెక్టర్ శిబి చక్రవర్తికి లభించింది. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడిస్తూ రాజ్‌కమమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ చిత్రానికి అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్నారు. 2027 సంక్రాంతికి ఈ మూవీని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అంతకు ముందు ఈ సినిమాకు సుందర్.సి దర్శకత్వం వహిస్తున్నట్లు ప్రకటన వెలువడింది. అయితే, అనుకోని కారణాల వల్ల దర్శకత్వ బాధ్యతల నుంచి సుందర్ వైదొలిగారు.దీంతో కొత్త డైరెక్టర్ ఎవరై ఉంటారా? అని ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలోనే రజనీని డైరెక్ట్ చేసే అవకాశం శిబి చక్రవర్తికి లభించింది. ఈ యువ దర్శకుడు 2022లో తీసిన డాన్ తమిళ మూవీ బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకుంది.

# పెద్ది వాయిదా?



కొత్త సంవత్సరంలో మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ అభిమానులకు షాక్ తగిలే న్యూస్ వైరల్ అవుతోంది. ప్రస్తుతం చరణ్ నటిస్తున్న చిత్రం పెద్ది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మెగా ఫ్యాన్స్ అందరూ పెద్దిపైనే ఆశలు పెట్టుకున్నారు. చికిరి చికిరి పాట రికార్డులు బద్దలు కొడుతోంది.

మార్చి 27న పెద్ది సినిమాను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ముందుగానే ప్రకటించారు. అందుకు తగ్గట్లే షూటింగ్‌ని ఫినిష్ చేస్తూ.. ఇంకోపక్క ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టారు. ఇక అందరూ అనుకున్నట్లుగానే న్యూయర్ కి పెద్ది నుంచి ఒక సర్ ప్రైజ్ పోస్టర్ కానీ, గ్లింప్స్ కానీ వస్తుంది అనుకుంటే.. మేకర్స్ మాత్రం ఈసారి చాలా సైలెంట్ గా ఉన్నారు. ఈ మౌనం వెనుక కారణం సినిమా వాయిదా పడడమే అని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. షూటింగ్ ఇంకా ఫినిష్ కాకపోవడం, కొన్ని సాంకేతిక కారణాల వలన మేకర్స్ పెద్దిని మార్చి 27 న రిలీజ్ చేయలేరని తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో మెగా ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది. ఇక పెద్ది కనుక ఆ టైమ్ కి రాకపోతే.. ది ప్యారడైజ్, టాక్సిక్ సినిమాలకు మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంది. మరి ఈ వార్తలపై మేకర్స్ ఎలా స్పందిస్తారో చూడాలి.

# ఒక్క పాట.. రూ.10 లక్షలు తెచ్చిపెట్టింది

ప్రపంచ యవనికపై తెలుగు పాటకు పట్టం కట్టేలా చేసిన గేయ రచయిత చంద్రబోస్. ఆర్ఆర్ఆర్ సినిమాకు, సంగీత దర్శకుడు కీరవాణితో కలిసి ఆస్కార్ అవార్డును కూడా అందుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన అనేక విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా గేయ రచయితల హక్కులు కాపాడటంతో పాటు, రాయల్టీ రూపంలో డబ్బులు ఎలా వస్తాయో వివరించారు. సినిమా ఇండస్ట్రీలో కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. గేయ రచయితలకు పారితోషికం బాగానే ఉంటుంది. బాగా రాసి, బహుళ ప్రజాదరణ పొందితే ఐపీఆర్ఎస్ (ఇండియన్ ఫెర్మారింగ్ రైట్స్ సొసైటీ) ద్వారా రాయల్టీ కూడా వస్తూ ఉంటుంది. పాట విజయాన్ని, ఘనతను, చరిత్రను బట్టి ఆ మొత్తం ఉంటుంది. ఎక్కువ వేదికల్లో మార్మోగితే ఇంకా ఎక్కువ డబ్బులు వస్తాయి. ఉదాహరణకు ఒక పాటకు రాయల్టీ రూపంలో రూపాయి వస్తే, అందులో రచయిత, సంగీత దర్శకుడికి చెరో పావలా, పబ్లిషింగ్ కంపెనీకి 50 పైసలు ఇస్తారు. అత్యంత



ప్రజాదరణ పొందిన పాటల్లో 'చిరు చిరు చినుకై కురిశావే' ఒకటి. ఆ పాట రాసినప్పుడు నాకు రూ.25వేలు ఇచ్చారు. అయితే ఇప్పటికి ఆ పాట రాయల్టీ రూపంలో రూ.10లక్షలు సంపాదించింది. ఇంకా వస్తూనే ఉంటుంది. రూ.50వేల నుంచి రూ.లక్ష వచ్చిన సందర్భమూ ఉంది. బ్రహ్మాస్త్ర'లో 'కుంకుమలా నువ్వే' పాట కూడా అంతే. మనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకుంటే, ప్రతిదీ ఒక మెట్టు అవుతుంది. అనువాద గీతాలు చక్కగా రాయడం వల్ల కూడా రాయల్టీ వస్తోంది. గత పది పదిహేనేళ్లుగా రచయితల పరిస్థితి బాగానే ఉంది. సాధారణంగా సినిమా కోసం పాట రాస్తాం. కానీ, ఆ పాట సినిమా నుంచి బయటకు వచ్చి, దానిని మించి ఎదుగుతోంది. ఒక పాటను థియేటర్, టీవీ, సెల్‌ఫోన్, రేడియో, హోటల్ లాంజ్‌లు, రియాల్టీషో ఇలా చాలా చోట్ల వింటాం. ఇంతకు ముందు రచయితలు కష్టపడేవారు. మా హక్కులను కాపాడిన వ్యక్తి సిరివెన్నెల సీతారామశాస్త్రి. ఐపీఆర్ఎస్ చట్టం ఆనుపానులు ఆయన పరిశీలించారు. పరిశోధించారు. ఆరోగ్యం సహకరించకపోయినా నిర్మాతలు, పబ్లిషర్ల తరపున పోరాటం చేశారు. లాయర్లతో కూర్చొని చర్చించి, ఏది చేస్తే రచయితలకు మేలు జరుగుతుందో అనే విషయాల కష్టపడి పరిశీలించి, ఫలాలను మాకిచ్చి వెళ్లిపోయారు. కరోనా సమయంలో ఎవరికీ పనులు లేవు. కానీ, రాయల్టీ వచ్చింది. ప్రతి రచయితకు మూడు నెలలకు ఒకసారి రూ. 50వేలు పంపారు. ఎంతో మంది యువ రచయితలకు ఇది ఉపయోగపడిందని చంద్రబోస్ చెప్పారు.

## బెల్లకొండ శ్రీనివాస్ 'హైందవ'

ఇటీవలే కిష్కిందపురి సినిమాతో హిట్ కొట్టిన యువ కథానాయకుడు బెల్లకొండ శ్రీనివాస్ మరో వైవిధ్యమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన కథానాయకుడిగా మహేశ్ చందు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హైందవ'. సంయుక్త కథానాయిక. శక్తిమంతమైన సేనలు మేల్కొంటే దశావతారాలు రక్షణగా నిలబడతాయి అని క్యాప్షన్ పెట్టారు. ఈ సినిమా పోస్టర్ శనివారం విడుదల చేశారు.

